



# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక    ప్రశ్నించడం మన హక్కు







సంపుటి : 1 సంచిక : 348 పేజీలు :8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : ఒంగోలు మంగళవారం 18 ఆగస్టు 2026 వెల : 1/-రూ ॥

VOLUME :1 ISSUE :348 PAGES :8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : ONGOLE TUE 18 AUGUST 2026 PRICE : 1/- RS

Simultaneously Published form Ongole,Visakhapatnam,Kakinada,Bapatla,Narasarao Peta, YSR Kadapa,Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari,West Godavari,Eluru,Guntur,SPSR Nellore,Tirupati,Chittor,Kurnool,Anantapur


# డీఎస్సీ నియామకాల్లో డీవియేషన్ లేదు..

## దమ్ముంటే అసెంబ్లీకి వచ్చి చర్చించాలి

### వైసీపీకి చంద్రబాబు సవాల్

- మెగా డీఎస్సీ నియామకాల్లో అంతా పారదర్శకమేనన్న సీఎం చంద్రబాబు
- అసెంబ్లీలో సుదీర్ఘ ప్రసంగం
- డీఎస్సీపై వైసీపీది హిట్ అండ్ రన్ తరహా దుష్ప్రచారం అంటూ ఫైర్
- దమ్ముంటే అసెంబ్లీకి వచ్చి చర్చించాలని ప్రతిపక్షానికి సవాల్
- 148 రోజుల్లో 15,941 ఉద్యోగాలను పారదర్శకంగా భర్తీ చేశామని వెల్లడి
- అసెంబ్లీకి రాకుండా బయట పబ్జీలు ఆడుకుంటున్నారని విమర్శ



**పెన్ పవర్ డెస్క్:**మెగా డీఎస్సీ నియామకాల్లో ఒక్క డీవియేషన్ కూడా జరగలేదని, ప్రతిభ ఆధారంగానే అత్యంత పారదర్శకంగా ప్రక్రియను పూర్తి చేశామని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. ఈ అంశంపై వైసీపీ చేస్తున్నది కేవలం హిట్ అండ్ రన్ ఆరోపణలేనని, వారికి దమ్ము, ధైర్యం ఉంటే శాసనసభకు వచ్చి చర్చించాలని ఆయన సవాల్ విసిరారు. ఒడిశా కూలీలతో, 90 ఏళ్ల జగన్ జెన్ జీ వృద్ధులతో ఫేక్ ప్రదర్శనలు చేయిస్తూ డీఎస్సీపై దుష్ప్రచారం చేస్తున్నారని ఆయన తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఇవాళ శాసనసభలో మెగా డీఎస్సీ నియామకాలపై జరిగిన చర్చలో సీఎం సుదీర్ఘంగా మాట్లాడారు.

**విద్యాభివృద్ధికి టీడీపీ కట్టుబడి ఉంది**

విద్యార్థులకు మంచి విద్య, నైపుణ్యాలు అందిస్తే వారే అత్యుత్తమ మానవ వనరులుగా తయారవుతారని తమ ప్రభుత్వం విశ్వసిస్తుందని చంద్రబాబు అన్నారు. ఎన్టీఆర్ హయాంలో రెసిడెన్షియల్ పాఠశాలలు, మహిళా యూనివర్సిటీ ఏర్పాటుతో విద్యా సంస్కరణలకు శ్రీకారం చుట్టామని గుర్తుచేశారు. తాను ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ప్రతి కిలోమీటరుకు ఓ ప్రాథమిక పాఠశాల, మండలానికి ఓ జూనియర్ కాలేజీ, జిల్లాకు ఓ మెడికల్ కాలేజీ ఏర్పాటు చేశామని తెలిపారు.

2019-24 మధ్య ఐదేళ్లలో ఒక్క ఉపాధ్యాయ పోస్టును కూడా భర్తీ చేయని పాలకులు, విద్యారంగంపై డబ్బాలు కొట్టుకున్నారని

- మిగతా 2లో



## నాగబాబుకు కీలక పదవి..

### కేబినెట్ హోదా కల్పిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు

- ఏపీ గ్రీన్ కార్యనిర్వాహక కమిటీ చైర్మన్‌గా నాగబాబు నియామకం
- రాష్ట్రంలో పచ్చదనాన్ని విశేషంగా పెంచడమే ఈ కమిటీ లక్ష్యం
- పర్యావరణ సమతుల్యత, అడవుల విస్తరణే ప్రధాన లక్ష్యం

- మిగతా 2లో



## అది నేరమా?..

### టీచర్ల సస్పెన్షన్‌పై వైఎస్ జగన్ ఫైర్!

- టెట్ నుంచి మినహాయింపు కోరిన ఐదుగురు టీచర్లను సస్పెండ్ చేశారన్న జగన్
- చంద్రబాబు ప్రభుత్వంపై తీవ్ర ఆగ్రహం
- ఇది కక్ష సాధింపు చర్యేనని సోషల్ మీడియాలో విమర్శలు
- సస్పెన్షన్లు ఎత్తివేసి క్షమాపణ చెప్పాలని డిమాండ్
- టీచర్లకు న్యాయపరంగా అండగా ఉంటామని హామీ

**పెన్ పవర్ డెస్క్:**ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) నుంచి మినహాయింపు కోరుతూ కేంద్ర ప్రభుత్వ ప్రతినిధులను కలిసిన ఐదుగురు టీచర్లను సస్పెండ్ చేశారంటూ వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి జగన్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ ఉద్యోగులు, ముఖ్యంగా ఉపాధ్యాయులపై ముఖ్యమంత్రి చంద్రబాబు కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని ఆరోపిస్తూ నేడు సోషల్ మీడియా వేదికగా ధ్వజమెత్తారు."మొదటి రోజు వైఎస్సార్ కడప జిల్లా టీచర్ల సంఘం వారిని, రెండో రోజు అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లాల టీచర్లను సస్పెండ్ చేశారు. ఆ ఐదుగురు ఉపాధ్యాయులను ఎందుకు సస్పెండ్ చేశారు? వారు చేసిన నేరం ఏమిటి?" అని జగన్ సూటిగా ప్రశ్నించారు. సర్వీసులో చేరినప్పుడు లేని టెట్ నిబంధనను ఇప్పుడు అమలు చేయడంతో లక్ష మందికి పైగా సీనియర్ టీచర్లు ఇబ్బందులు పడుతున్నారని ఆయన పేర్కొన్నారు. ఈ నిబంధన నుంచి మినహాయింపు కోరుతూ తమకు అండగా నిలిచిన ఎంపీల సహకారంతో కేంద్ర ప్రభుత్వానికి వినతిపత్రం

- మిగతా 2లో



## నిజాలు బయటకు రావాలంటే సీబీఐ విచారణ ఒక్కటే సరైన మార్గం

- డీఎస్సీ అంశంపై శాసనమండలిలో వైసీపీ రచ్చ
- నారా లోకేశ్ తక్షణమే రాజీనామా చేయాలన్న బొత్స సత్యనారాయణ
- నిరుద్యోగులను ప్రభుత్వం మోసం చేసిందని మండిపాటు

**పెన్ పవర్ డెస్క్:**ఆంధ్రప్రదేశ్ శాసనమండలి సమావేశాలు మెగా డీఎస్సీ వివాదంతో తీవ్ర ఉద్రిక్తతల మధ్య ప్రారంభమయ్యాయి. కూటమి ప్రభుత్వం చేపట్టిన టీచర్ నియామకాల ప్రక్రియలో పెద్ద ఎత్తున అక్రమాలు జరిగాయంటూ ప్రతిపక్ష వైసీపీ తీవ్ర

- మిగతా 2లో

## డిగ్రీ పూర్తి కాగానే క్రికెటర్ శ్రీ చరణికి ప్రభుత్వ ఉద్యోగం

### అసెంబ్లీలో మంత్రి నారా లోకేశ్

- మహిళా క్రికెటర్ శ్రీ చరణికి డిగ్రీ కాగానే ఉద్యోగం ఇస్తామని అసెంబ్లీలో మంత్రి లోకేశ్ ప్రకటన
- క్రీడలను ప్రోత్సహించడంపై ప్రజా ప్రభుత్వానికి స్పష్టమైన విధానం ఉందని వెల్లడి
- పీవీ సింధు, జ్యోతి యర్రాజికి ఉద్యోగాలు ఇచ్చింది తామేనని గుర్తు చేసిన మంత్రి
- స్పోర్ట్స్ కోటా భర్తీలో ఎలాంటి అక్రమాలు జరగలేదని, ఆరోపణలు నిరాధారమని ఖండన

**పెన్ పవర్ డెస్క్:**భారత మహిళా క్రికెట్ జట్టులో అద్భుతమైన బౌలర్‌గా రాణిస్తున్న తెలుగు తేజం శ్రీ చరణికి త్వరలోనే ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వనున్నట్లు రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ప్రకటించారు. ఆమె డిగ్రీ పూర్తి చేసిన వెంటనే ఉద్యోగం కల్పించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారని వెల్లడించారు.

- మిగతా 2లో





## స్వాతంత్ర్య దినోత్సవానికి ముందే భారీ కుట్ర భగ్నం

- ఐఎస్ఐ అండతో పనిచేస్తున్న షాజాద్ భట్టి ఉగ్ర నెట్‌వర్క్‌ను ధ్వంసం చేశామన్న అమిత్ షా
- స్వాతంత్ర్య దినోత్సవానికి ముందే దాడుల కుట్రను భగ్నం చేశామన్న అమిత్ షా
- 14 రాష్ట్రాల్లో విస్తృతంగా ఆపరేషన్లు.. 200 మందికి పైగా అరెస్ట్

**పెన్ పవర్ డెస్క్:**పాకిస్థాన్ ఐఎస్ఐ మద్దతుతో కార్యకలాపాలు సాగిస్తున్న 'షాజాద్ భట్టి నెట్‌వర్క్' అనే ఉగ్రవాద ముఠాను పూర్తిగా నిర్మూలించినట్లు కేంద్ర హోంమంత్రి అమిత్ షా సోమవారం ప్రకటించారు. స్వాతంత్ర్య దినోత్సవానికి ముందే దేశంలో విధ్వంసక దాడులు చేసేందుకు

- మిగతా 2లో

## మా నడిమిట్లకొస్తే ఒమన్‌పై బాంబేస్తాం

### అమెరికా అధ్యక్షుడు ట్రంప్ వార్నింగ్




**పెన్ పవర్ డెస్క్:**రాన్‌తో అమెరికాకు ఉన్న ఘర్షణ వాతావరణంలో మిడిల్ ఈస్ట్ దేశమైన ఒమన్ అడ్డు వస్తే ఆ దేశాన్ని నాశనం చేస్తామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సోమవారం హెచ్చరించారు. అమెరికా-ఇరాన్ కాల్పుల విరమణ గడువుకు కొన్ని రోజుల ముందు.. ఆయన ఒక ఇంటర్వ్యూలో మాట్లాడుతూ ఈ హెచ్చరిక ప్రకటన చేశారు. "ఒమన్ అడ్డుపడితే, వాళ్ళను బాంబులతో నాశనం చేస్తాం," అని ట్రంప్ చేసిన వ్యాఖ్యలు అంతర్జాతీయంగా హాట్ టాపిక్?గా మారాయి.గత కొన్ని వారాలుగా, హోర్ముజ్ జలసంధి నుంచి నౌకా రవాణా నిర్వహణకు సంబంధించిన తాత్కాలిక ఏర్పాటు కోసం ఒక ఒప్పందాన్ని కుదుర్చుకోవడానికి ఇరాన్ దౌత్యవేత్తలు ఒమన్ అధికారులతో చర్చలు జరుపుతున్న సంగతి తెలిసిందే. మిడిల్ ఈస్ట్ వార్‌లో అత్యంత కీలకమైన ప్రాంతాలలో ఒకటిగా మారిన హోర్ముజ్ జలసంధిపై నియంత్రణ

- మిగతా 2లో

## యూపీలో జడ్జి సంచలనం.. 4 నెలల్లో 22 మందికి మరణశిక్ష!

- యూపీలో ఓ జడ్జి నాలుగు నెలల్లో 22 మందికి ఉరిశిక్ష విధించిన జడ్జి
- ముజఫర్‌నగర్ అదనపు సెషన్స్ జడ్జి రవికుమార్ దివాకర్ తీర్పులు
- న్యాయవాది హత్య, దోపిడీ వంటి 10 తీవ్రమైన కేసుల్లో ఈ శిక్షలు ఖరారు



- మిగతా 2లో

## విడాకులు ఇవ్వకుండా రెండో పెళ్లి చేసుకుంటే.. జీతంలో 20శాతం కోత



**పెన్ పవర్ డెస్క్:**బహుభార్యత్వం నిషేధం దిశగా కీలక చర్యలు చేపడుతోన్న అస్సాం ప్రభుత్వం.. తాజాగా మరో నిర్ణయం తీసుకుంది. మొదటి భార్యకు విడాకులు ఇవ్వకుండా రెండో పెళ్లి చేసుకున్న ప్రభుత్వ ఉద్యోగుల జీతంలో కోత పెట్టనుంది. ఈ మేరకు రాష్ట్ర ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ సోమవారం ఈ కీలక ప్రకటన చేశారు."ప్రభుత్వ ఉద్యోగి

- మిగతా 2లో



## బీజేపీ కొత్త టీమ్‌లో ఏపీకి 3 కీలక పదవులు..

### తెలంగాణకు నో ప్లేస్!

- బీజేపీ కొత్త జాతీయ టీమ్‌ను ప్రకటించిన నితిన్ నబిన్
- ఏపీ నుంచి ముగ్గురికి కీలక పదవులు
- పురందేశ్వరి, రామ్ మాధవ్‌కు ఉపాధ్యక్ష పదవులు
- విష్ణువర్ధన్ రెడ్డికి జాయింట్ కో-ఆర్డినేటర్ బాధ్యత
- స్మృతి ఇరానీకి జాతీయ ప్రధాన కార్యదర్శి పదవి

**పెన్ పవర్ డెస్క్:**బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్ కొత్త జాతీ య కార్యవర్గాన్ని ప్రకటించారు. ఇందులో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ముగ్గురికి కీలక బాధ్యతలు దక్కాయి. డి. పురందేశ్వరి,

- మిగతా 2లో




## జగన్ కూటమిపై మానసికంగా గెలిచినట్లేనా?

వైసీపీ అధినేత వైఎస్ జగన్ పర్యటనలకు జనం పోటెత్తుతున్నారు. ఒకరకంగా ఇది కేవలం తన పార్టీలో మానసిక స్థైర్యాన్ని ధైర్యాన్ని నింపడమే కాదు..ప్రత్యర్థులను కూడా ఆలోచనలో పడేస్తున్నాయి. కూటమిలోని అన్ని పార్టీలు జగన్ పర్యటనలకు వచ్చే జనసందోహాన్ని చూసి బయటకు విమర్శలు చేస్తున్నప్పటికీ లోలోపల మాత్రం వైసీపీ కొంత పుంజుకుందన్న అభిప్రాయం వినిపిస్తుంది. ఎంత అంటే ఇప్పుడే చెప్పలేం కానీ ఆయన తన ఓటు బ్యాంకును మరింత బలపర్చుకునే రీతిలోనే జగన్ పర్యటలను కొనసాగిస్తున్నారని ఖచ్చితంగా ప్రత్యర్థులు కూడా అంచనా వేస్తున్నారు. అందుకు అనుగుణంగా జాగ్రత్తలు పడుతున్నారు. ఎవరికి వారే తమ నియోజకవర్గాల్లోనూ, కూటమి పార్టీల అధినేతల ఆలోచనల్లోనూ ఇదే రకమైన అభిప్రాయం ఉంది. కానీ దానిని ఎవరూ బయటకు చెప్పుకోలేరు. అలాగని కొట్టిపారేయలేని పరిస్థితి.

**అసంతృప్తి ఉందని ...**

కొంత అధికార పార్టీపైన, ప్రభుత్వంపైన, స్థానిక ఎమ్మెల్యేలల పైనా ప్రజల్లో అసంతృప్తి ఉందని జగన్ పర్యటనలను చూస్తుంటే తెలుస్తుందని అధికార పార్టీ నేతలే అంటున్నారంటే జగన్ కొంత వరకూ ప్రత్యర్థులను మానసికంగా గెలవడంలో సక్సెస్ అయినట్లే. ఇక ఆయన తీసుకోవాల్సిన ముఖ్య జాగ్రత్తలు ఎలక్షనీరింగ్. మళ్లీ తన బొమ్మతోనే గెలుస్తామనుకుంటే వీలు కాదు. ఎందుకంటే కూటమి విడిపోయే అవకాశాలు లేవు. కలసి ఉన్నంత వరకూ జగన్ అధికారంలోకి రావడం కష్టమే. కూటమి కలసి ఉన్నా పవర్ లోకి రావాలంటే అందరికీ ఆలోచనల్లో భాగస్వామ్యం కల్పించాలి. ముఖ్యంగా పోలింగ్ కేంద్రాల వద్ద తన బలగాన్ని ధైర్యంగా మొహరించగలగాలి. అవి జరగకుంటే 2024 ఎన్నికల ఫలితాలు తిరిగి రిపీట్ అవ్వవన్న గ్యారంటీ లేదు. అందుకే జగన్ పర్యటనలకు వచ్చిన జనాన్ని చూసి మురిసిపోయి...పరవశించి... మళ్లీ పాత పద్ధతికే అలవాటు పడితే దెబ్బతినడం ఖాయం. ప్రత్యర్థులు జగన్ మైండ్ సెట్ అలాగే ఉంటుందని భావించి కొంత వరకూ భరోసాగా ఉన్నారు.

**క్యాడర్ లో ఉత్సాహం...**

వైఎస్ జగన్ జిల్లాల పర్యటనలు, ప్రజల్లోకి వెళ్లడం వల్ల ఆయనలో మరియు పార్టీ శ్రేణుల్లో నూతనోత్సాహం, ధైర్యం పెరుగుతున్నాయని వైసీపీ వర్గాలు భావిస్తున్నాయి. ప్రజా స్పందనను చూసి ఆయనలో పోరాట పటిమ బలపడుతోందని పార్టీ నేతలు అంటున్నారు. అయితే, రాజకీయ ప్రత్యర్థులు మాత్రం ఆయన పర్యటనలను విమర్శిస్తూ, అసెంబ్లీకి వచ్చే ధైర్యం లేకనే ఇలా ప్రజల్లో ఉంటున్నారని ఆరోపిస్తున్నారు. జగన్ పర్యటనల ద్వారా కిందిస్థాయి నాయకుల్లో, కార్యకర్తల్లో ధైర్యం నింపే ప్రయత్నం జరుగుతోంది. పర్యటనలకు వస్తున్న జనసందోహం పార్టీలో నమ్మకాన్ని పెంచుతోందని వైఎస్సార్‌సీపీ అంటోంది. అసెంబ్లీ సమావేశాలకు హాజరుకాకుండా కేవలం బయట పర్యటనలు చేయడంపై అధికార పార్టీ నేతలు విమర్శలు గుప్పిస్తున్నారు. అయినా సరే.. జగన్ పర్యటనలతో ఇక అధికార పార్టీకి భయపడి ఎవరూ ఇంట్లో దాక్కునే పరిస్థితి లేదు. జెండా అందుకుని వీధుల్లోకి వచ్చే ధైర్యాన్ని మాత్రం జగన్ నింపగలిగారు. మూడు ప్రాంతాల పర్యటనలు శ్రీకాకుళం, తూర్పు గోదావరి, కర్నూలు పర్యటనలతో వైసీపీ ఉత్సాహం రెట్టింపయిందనే చెప్పాలి.

### స్వాతంత్ర్య దినోత్సవానికి ముందే

## భారీ కుట్ర భగ్నం

- మొదటి పేజి తరువాయి

పన్నిన భారీ కుట్రను భద్రతా బలగాలు భగ్నం చేశాయని, ఈ క్రమంలో 14 రాష్ట్రాల్లో 200 మందికి పైగా నిందితులను అరెస్ట్ చేసినట్లు ఆయన వెల్లడించారు. ఈ మేరకు అమిత్ షా సామాజిక మాధ్యమం 'ఎక్స్' వేదికగా వివరాలను వెల్లడించారు. భద్రతా బలగాలు సమన్వయంతో చేపట్టిన ఆపరేషన్ల ద్వారా ఈ నెట్‌వర్క్‌ను ఛిన్నాభిన్నం చేసినట్లు పేర్కొన్నారు. ఉగ్రవాదంపై నరేంద్ర మోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న జీరో టాలరెన్స్ విధానానికి ఈ విజయమే నిదర్శనమని ఆయన స్పష్టం చేశారు. కేంద్ర హోం మంత్రిత్వ శాఖ వెల్లడించిన వివరాల ప్రకారం, ఆగస్టు 12వ తేదీన దేశవ్యాప్తంగా 14 రాష్ట్రాల్లో ఏకకాలంలో దాడులు నిర్వహించారు. ఈ ఆపరేషన్?లలో మొత్తం 253 మందిని అదుపులోకి తీసుకోగా, 200 మందికి పైగా నిందితులను అధికారికంగా అరెస్ట్ చేశారు. ఈ వ్యవహారంలో ఇప్పటివరకు 80కి పైగా ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయి. అత్యధికంగా ఉత్తరప్రదేశ్‌లో 62 మంది, హర్యానాలో 52, ఢిల్లీలో 51, పంజాబ్‌లో 44 మందిని అదుపులోకి తీసుకున్నారు. నిందితుల నుంచి ఐఈడీలు, పాకిస్థాన్ ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ ముద్రలు కలిగిన గ్రెనేడ్లు, పిస్టళ్లు, మందుగుండు సామాగ్రితో పాటు గూఢచర్యం కోసం వినియోగించే రహస్య కెమెరాలను స్వాధీనం చేసుకున్నట్లు అధికారులు తెలిపారు.

షాజాద్ భట్టి నెట్‌వర్క్, ప్రధానంగా గ్రెనేడ్, ఐఈడీలు, పెట్రోల్ బాంబు దాడులతో పాటు లక్షిత హత్యలకు కుట్ర పన్నుతున్నట్లు అధికారులు వివరించారు. పోలీసు స్టేషన్లు, రక్షణ సంస్థలు, మతపరమైన ప్రదేశాలపై నిఘా ఉంచేందుకు ఈ ముఠా స్థానికులకు భారీగా నగదు చెల్లించిందని ప్రాథమిక విచారణలో వెల్లడైంది.

# డీఎస్సీ నియామకాల్లో డీవియేషన్ లేదు..

- మొదటి పేజి తరువాయి

ఎద్దేవా చేశారు. ఇప్పటివరకు 14 డీఎస్సీలు జరిగితే, వాటిలో 11 డీఎస్సీలను టీడీపీ, ఎన్డీయే ప్రభుత్వాల హయాంలోనే నిర్వహించి, అవినీతికి ఆస్కారం లేకుండా నియామకాలు చేపట్టామని వివరించారు.

**148 రోజుల్లోనే పారదర్శకంగా నియామకాలు**

గత పాలకులు ఐదేళ్లలో చేయలేని పనిని, తాము అధికారంలోకి వచ్చిన వెంటనే తొలి సంతకంతో చేసి చూపించామని చంద్రబాబు అన్నారు. మెగా డీఎస్సీ ద్వారా 15,941 ఉద్యోగాలను కేవలం 148 రోజుల్లోనే పారదర్శకంగా భర్తీ చేశామని వివరించారు. టెట్, డీఎస్సీ నోటిఫికేషన్ల నుంచి హారిజాంటల్, వర్టికల్ రిజర్వేషన్ల ప్రక్రియ వరకు అన్నీ కట్టుదిట్టంగా చేపట్టామన్నారు. 13 సబ్జెక్టులకు 42 వేల ప్రశ్నలను ఎంపిక చేసి, 154 కేంద్రాల్లో కంప్యూటర్ ఆధారిత (సీబీటీ) విధానంలో పరీక్షలు నిర్వహించి, ఫలితాలను కూడా పారదర్శకంగా విడుదల చేశామని తెలిపారు. మెరిట్ కమ్ రోస్టర్ విధానంలోనే పూర్తి ప్రతిభ ప్రకారం 15,941 మందిని ఎంపిక చేశామని, నియామక ప్రక్రియ వివరాలన్నీ ఆన్‌లైన్‌లో ఉన్నాయని, ఇంతకంటే పారదర్శకత ఎక్కడ ఉంటుందని ప్రశ్నించారు. ఫిర్యాదుల పరిష్కారానికి జోనల్, రాష్ట్రస్థాయి కమిటీలతో పాటు అప్పీలేట్ అథారిటీని కూడా ఏర్పాటు చేశామన్నారు.

**వైసీపీవి ఫేక్ ఆందోళనలు, కుట్రలు**

డీఎస్సీపై వైసీపీ నిరాధార ఆరోపణలు చేస్తోందని సీఎం ధ్వజమెత్తారు. "గొడ్డలి పార్టీ నేతలు ఒడిశా కూలీలతో, 90 ఏళ్ల జగన్ జెన్‌జీ వ్యక్తులతో ఫేక్ ధర్నాలు చేయిస్తున్నారు. ప్రభుత్వంలో పనిచేసి రిటైరైన ఓ ఐఏఎస్ అధికారి, ఓ మాజీ మంత్రి ఇష్టానుసారం మాట్లాడుతున్నారు" అని విమర్శించారు. వైసీపీ ఆరోపణలను సహించలేకే డీఎస్సీలో ఉద్యోగాలు సాధించిన టీచర్లే స్వయంగా రోడ్లపైకి వస్తున్నారని, మొన్న కర్నూలులో, నిన్న విజయవాడలో భారీగా ఆందోళనలు చేశారని గుర్తుచేశారు. "పిల్లలకు పాఠాలు చెబుతాం.. మా ప్రతిభను కించపరిస్తే గుణపాఠం కూడా చెబుతాం" అని వారు నినదించిన విషయాన్ని చంద్రబాబు సభ దృష్టికి తెచ్చారు.

**అసెంబ్లీకి రాకుండా పబ్జీలా?**

తమ ప్రభుత్వం ప్రజలకు జవాబుదారీ అని, కుట్రలు చేసే పార్టీలకు కాదని చంద్రబాబు తేల్చిచెప్పారు. "ధైర్యం ఉంటే అసెంబ్లీకి వచ్చి చర్చించాలి. అడ్డంగా దొరికిపోతామనే భయంతో వారు సభకు రావడం లేదు. సిగ్గులేని ఆ పార్టీ సభ్యులు అసెంబ్లీకి రాకుండా బయట పబ్జీలు ఆడుకుంటున్నారు. రెండున్నరేళ్లుగా సభకు రాకుండానే జీతాలు, ప్రివిలేజెస్ తీసుకుంటున్నారు. నా జీవితంలో ఇలాంటి పార్టీని చూడలేదు" అని తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. తనకు ప్రజల పట్ల పూర్తి బాధ్యత ఉందని, రాష్ట్రంలో ఎలాంటి కుట్రలు పనిచేయవని, ఉపాధ్యాయ నియామకాలు అత్యంత జవాబుదారీతనంతో జరిగాయని సీఎం పునరుద్ఘాటించారు.

## యూపీలో జడ్జి సంచలనం.. 4 నెలల్లో 22 మందికి మరణశిక్ష!

ఉత్తరప్రదేశ్‌లోని ముజఫర్‌నగర్‌కు చెందిన అదనపు జిల్లా, సెషన్స్ జడ్జి కేవలం నాలుగు నెలల కాలంలోనే 10 వేర్వేరు కేసుల్లో 22 మందికి మరణశిక్ష విధించి దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించారు. ఈ వరుస తీర్పుల నేపథ్యంలో దేశంలో మరణశిక్షల అమలుపై మరోసారి విస్తృత చర్చ ప్రారంభమైంది. ప్రభుత్వ న్యాయవాది వెల్లడించిన వివరాల ప్రకారం, జడ్జి రవికుమార్ దివాకర్ ఈ ఏడాది ఏప్రిల్ నుంచి ఆగస్టు మధ్య కాలంలో ఈ కీలక తీర్పులను వెలువరించారు. న్యాయవాది సమీర్ సఫీ హత్య కేసు, హోంగార్డు హత్య, హైవే దోపిడీ, ఆర్థిక లాభం కోసం కిడ్నాప్ చేసి హత్య చేయడం వంటి అత్యంత క్రూరమైన నేరాల్లో నిందితులకు ఈ కఠిన శిక్షలు ఖరారు చేశారు. ఇందులో భాగంగా ఏప్రిల్‌లో ఏడుగురికి, మే నెలలో ఒకరికి, జూన్‌లో ఇద్దరికి, జూలైలో ఏడుగురికి, ఆగస్టు 13 నాటికి మరో ఐదుగురికి మరణశిక్ష విధించారు.

ఇటీవల ఆగస్టు 12న, 1999 నాటి కిడ్నాప్, హత్య కేసులో షానవాజ్‌కు, ఆగస్టు 13న షామ్లీ జిల్లాలో జరిగిన పవన్ కుమార్ హత్య కేసులో నలుగురికి ఉరిశిక్ష విధిస్తూ ఆయన తీర్పునిచ్చారు. జడ్జి దివాకర్ గతంలో బరేలీలో పనిచేస్తున్న సమయంలోనూ 13 మందికి మరణశిక్ష విధించిన చరిత్ర ఉంది. దీంతో ఆయన ఇప్పటివరకు తన పదవీ కాలంలో మొత్తం 35 మందికి మరణశిక్ష విధించినట్లయింది.

2022లో వారణాసిలోని జ్ఞానవాపి మసీదులో వీడియోగ్రాఫిక్ సర్వేకు ఆదేశాలు జారీ చేసి జడ్జి రవికుమార్ దివాకర్ దేశవ్యాప్త గుర్తింపు పొందారు. అయితే, సెషన్స్ కోర్టు విధించిన మరణశిక్షలు అమలు కావాలంటే నిబంధనల ప్రకారం హైకోర్టు వాటిని ధ్రువీకరించాల్సి ఉంటుంది. అలాగే, ఈ తీర్పులను సవాలు చేస్తూ నిందితులకు సుప్రీంకోర్టులో అప్పీల్ చేసుకునే చట్టపరమైన అవకాశం కూడా ఉంటుంది.

# అది నేరమా?..

- మొదటి పేజి తరువాయి

ఇవ్వడం నేరమా? అని జగన్ నిలదీశారు. తక్షణమే ఉపాధ్యాయుల సస్పెన్షన్లను రద్దు చేసి, వారికి ముఖ్యమంత్రి క్షమాపణ చెప్పాలని జగన్ డిమాండ్ చేశారు. ఈ అన్యాయమైన సస్పెన్షన్లపై న్యాయపోరాటంలో టీచర్లకు వైసీపీ పూర్తి అండగా ఉంటుందని పేర్కొన్నారు. "మీ రెడ్ బుక్ అరాచక పాలన ఇప్పుడు ప్రభుత్వ ఉపాధ్యాయులను కూడా వదలడం లేదు. చంద్రబాబు గారూ.. నిజానికి మీరే కేంద్ర ప్రభుత్వాన్ని ఈ టెట్ నిబంధనను తొలగించాలని కోరాలి కదా? ఎన్డీఏలో భాగస్వామిగా ఉండి అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రంపై ఎందుకు ఒత్తిడి తీసుకురాలేదు?" అని జగన్ విమర్శించారు. "మీరు చేయాల్సిన పని చేయలేదు. సీనియర్ టీచర్ల సమస్యలను గాలికొదిలేశారు. మా పార్టీ ఎంపీల మద్దతుతో వారు తమ సమస్యను కేంద్రం దృష్టికి తీసుకెళ్లే ప్రయత్నం చేస్తే, దానికి రాజకీయ రంగు పులిమి సస్పెండ్ చేశారు. మీరు చేయలేని పనిని వారు చేయడానికి ప్రయత్నించడమే వారి తప్పా? ఒక సమస్యను పరిష్కరించాల్సింది పోయి, దానికి రాజకీయ దురుద్దేశాలు ఆపాదించడం దారుణం. ఇంతగా ఎలా దిగజారిపోయారు?" అని జగన్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఉద్యోగులకు మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలన్నింటినీ చంద్రబాబు గాలికొదిలేశారని జగన్ ఆరోపించారు. ప్రభుత్వం ఏర్పడి మూడో ఏడాది నడుస్తున్నా

మధ్యంతర భృతి (ఐఆర్), పీఆర్సీ హామీలు నెరవేర్చలేదని, ఐదు డీఏలు పెండింగ్‌లోనే ఉన్నాయని గుర్తుచేశారు. "చంద్రబాబు గారూ.. అధికార అహంకారంతో మీరు వ్యవహరిస్తున్న తీరును, మీ నియంతృత్వ విధానాలను ప్రజలు గమనిస్తున్నారు. చివరకు మీ నీడను చూసి కూడా మీరు సహించలేని స్థాయికి చేరుకున్నారు" అని జగన్ విమర్శించారు.

## విడాకులు ఇవ్వకుండా రెండో పెళ్లి చేసుకుంటే.. జీతంలో 20శాతం కోత

- మొదటి పేజి తరువాయి

ఎవరైనా చట్టబద్ధంగా తన భార్య నుంచి విడాకులు తీసుకోకుండా ఆమెను వదిలేసి మరో మహిళతో వివాహ బంధం ఏర్పరుచుకుంటే.. ఆ వ్యక్తిపై చర్యలు తీసుకుంటాం. సదరు ఉద్యోగి జీతం నుంచి 20శాతం కోత విధించి.. ఆ మొత్తాన్ని మొదటి భార్య బ్యాంకు ఖాతాలో నేరుగా జమ చేస్తాం. అయితే, ఆ ఉద్యోగి మొదటి భార్య దీని గురించి ప్రభుత్వం వద్ద దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది" అని సీఎం హిమంత వెల్లడించారు. ఇటీవల ప్రభుత్వ ఉద్యోగుల్లో కొంతమంది విడాకుల ప్రక్రియ పూర్తికాకుండానే మరో మహిళతో కలిసి ఉంటున్న కేసులు వెలుగుచూసిన నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు హిమంత తెలిపారు. విడాకుల అంశం కోర్టు వద్ద పెండింగ్‌లో ఉన్నా కూడా.. జీతంలో కోత కొనసాగుతుందని స్పష్టం చేశారు. న్యాయపరమైన ప్రక్రియ పూర్తయ్యేవరకు ఎదురుచూడకుండా మొదటి భార్యకు ఆర్థిక సహకారం అందించాలనేదే తమ ఉద్దేశమని పేర్కొన్నారు. ఇక, తల్లిదండ్రులను నిర్లక్ష్యం చేసే ప్రభుత్వ ఉద్యోగుల వేతనంలో 10శాతం కోత విధించనున్నట్లు హిమంత తెలిపారు.

## బీజేపీ కొత్త టీమ్‌లో ఏపీకి 3 కీలక పదవులు..

# తెలంగాణకు నో ప్లేస్!

- మొదటి పేజి తరువాయి

రామ్ మాధవ్‌కు జాతీయ ఉపాధ్యక్ష పదవులు వరించాయి. విష్ణువ ర్ధన్ రెడ్డికి జాయింట్ కో-ఆర్డినేటర్ బాధ్యతలు అప్పగించారు. అదే సమయంలో తెలంగాణ నుంచి ఒక్కరికి కూడా జాతీయ టీమ్‌లో చోటు దక్కకపోవడం చర్చనీయాంశంగా మారింది. కొత్త కార్యవర్గంలో కేరళ, పశ్చిమ బెంగాల్, ఒడిశా, ఈశాన్య రాష్ట్రాలకు చెందిన నేతలకు ప్రాధాన్యం ఇచ్చారు. రాజస్థాన్ మాజీ సీఎం వసుంధర రాజే, ఒడిశాకు చెందిన బైజయంత్ పాండా, ఉత్తరప్రదేశ్‌కు చెందిన రేఖా వర్మ, తారిఖ్ మన్సూర్ జాతీయ ఉపాధ్యక్షులుగా కొనసాగనున్నారు. ఉత్తరాఖండ్ మాజీ సీఎం తీరత్ సింగ్ రావత్, పంజాబ్‌కు చెందిన మన్‌ప్రీత్ సింగ్ బాదల్ సహా పలువురికి ఇదే బాధ్యతలు అప్పగించారు. 13 మంది జాతీయ ఉపాధ్యక్షుల్లో మహిళలకు గణనీయమైన ప్రాతినిధ్యం కల్పించారు. మాజీ కేంద్ర మంత్రి స్మృతి ఇరానీకి జాతీయ ప్రధాన కార్యదర్శి పదవి దక్కింది. 2024 లోక్‌సభ ఎన్నికల్లో ఓటమి తర్వాత ఆమెకు లభించిన తొలి కీలక సంస్థాగత బాధ్యత ఇదే. వినోద్ తావ్‌డే, సునీల్ బన్సల్, బిప్లవ్ కుమార్ దేవ్ సహా పలువురు ప్రధాన కార్యదర్శులుగా కొనసాగనున్నారు. వసుంధర రాజే, స్మృతి ఇరానీ మళ్లీ కీలక సంస్థాగత పదవుల్లోకి రావడం ప్రాధాన్యం సంతరించుకుంది. బీఎల్ సంతోష్

జాతీయ ప్రధాన కార్యదర్శి (సంస్థాగత)గా కొనసాగనున్నారు. శివప్రకాశ్, సౌదాన్ సింగ్ సంయుక్త ప్రధాన కార్యదర్శులు (సంస్థాగత)గా బాధ్యతలు చేపట్టనున్నారు. పీయూష్ గోయల్‌కు జాతీయ కోశాధికారి పదవి ఇచ్చారు. ఈశాన్య రాష్ట్రాల సమన్వయకర్తగా సంబిత్ పాత్రను నియమించారు. పార్టీ మీడియా వ్యవహారాలను అనిల్ బలూనీ చూసుకోనున్నారు. తెలంగాణకు మాత్రం ఈసారి జాతీయ కార్యవర్గంలో ప్రాతినిధ్యం దక్కలేదు. గతంలో డీకే అరుణ జాతీయ ఉపాధ్యక్షురాలిగా కొనసాగారు. ఓబీసీ మోర్చా అధ్యక్షుడిగా లక్ష్మణ్ బాధ్యతలు నిర్వహించారు. కొత్త టీమ్‌లో ఇద్దరికీ చోటు దక్కలేదు. తెలంగాణలో పార్టీని మరింత విస్తరించడమే తదుపరి లక్ష్యమని బీజేపీ చెబుతున్న సమయంలో.. జాతీయ స్థాయి పదవుల్లో రాష్ట్రానికి ప్రాతినిధ్యం లేకపోవడం రాజకీయ వర్గాల్లో చర్చకు దారితీస్తోంది.

## డిగ్రీ పూర్తి కాగానే క్రికెటర్ శ్రీ చరణికి ప్రభుత్వ ఉద్యోగం

- మొదటి పేజి తరువాయి

సోమవారం ప్రారంభమైన ఏపీ అసెంబ్లీ వర్షాకాల సమావేశాల్లో మెగా డీఎస్సీ, స్పోర్ట్స్ కోటాపై జరిగిన చర్చలో ఆయన ఈ విషయాన్ని తెలిపారు. క్రీడాకారులను ప్రోత్సహించడమే తమ ప్రభుత్వ విధానమని, వారికి టెస్టులు పెట్టాల్సిన అవసరం లేదని, వారి ప్రతిభే కొలమానమని లోకేశ్ స్పష్టం చేశారు. ఈ సందర్భంగా మంత్రి లోకేశ్ మాట్లాడుతూ.. "ప్రధాని నరేంద్ర మోదీ స్ఫూర్తితో రాష్ట్రంలో క్రీడలను, క్రీడాకారులను పెద్ద ఎత్తున ప్రోత్సహించాలన్నది మా ప్రభుత్వ నిర్ణయం. యువత క్రీడలను ఒక ప్రొఫెషన్‌గా తీసుకోవాలి, రిటైర్ అయ్యాక వారి భవిష్యత్తుకు భరోసా కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందని ప్రధాని చెబుతున్నారు. కేంద్రం తీసుకొచ్చిన అద్భుతమైన క్రీడా పాలసీని స్వీకరించి, రాష్ట్రంలో మరింత పకడ్బందీగా అమలు చేస్తున్నాం" అని వివరించారు. గతంలో తమ ప్రభుత్వం క్రీడాకారులకు అండగా నిలిచిన తీరును లోకేశ్ గుర్తుచేశారు. "బ్యాడ్మింటన్ స్టార్ పీవీ సింధుకు ప్రభుత్వ ఉద్యోగం ఇచ్చింది మా ప్రజా ప్రభుత్వమే. త్వరలోనే ఆమె కన్ఫర్డ్ ఐఏఎస్ అధికారి కాబోతున్నారు. ఆమెకు భూమి కూడా కేటాయించాం. అదే విధంగా, ఉత్తరాంధ్ర బిడ్డ, ట్రాక్ అండ్ ఫీల్డ్‌లో ఒలింపిక్ ఆశాకిరణం జ్యోతి యర్రాజి విషయంలోనూ ముఖ్యమంత్రి చంద్రబాబు వెంటనే స్పందించి ప్రభుత్వ ఉద్యోగం మంజూరు చేశారు. ఇప్పుడు శ్రీ చరణికి కూడా అదే విధంగా భరోసా ఇస్తున్నాం" అని పేర్కొన్నారు.

**స్పోర్ట్స్ కోటాపై ఆరోపణలు నిరాధారం**

డీఎస్సీ స్పోర్ట్స్ కోటా నియామకాలపై వైసీపీ చేస్తున్న ఆరోపణలను మంత్రి లోకేశ్ తీవ్రంగా ఖండించారు. ఈ నియామకాల ప్రక్రియ అత్యంత పారదర్శకంగా జరిగిందని స్పష్టం చేశారు. "కేంద్ర ప్రభుత్వ సూచనల మేరకు రాష్ట్రంలో గతంలో ఉన్న 29 క్రీడాంశాలను 65కి పెంచాం. వాటిలో కూడా ప్రయారిటీ-1, ప్రయారిటీ-2గా విభజించి, మొదట ప్రయారిటీ-1 అభ్యర్థులనే భర్తీ చేశాం. స్పోర్ట్స్ సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌ను 'శాప్' (ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థ) ఆధ్వర్యంలో సుమారు నెల రోజుల పాటు వివిధ దశల్లో కఠినంగా నిర్వహించాం. మొత్తం ప్రక్రియ పూర్తయి, అభ్యర్థులు శిక్షణ కూడా తీసుకుని ఏడాది గడిచాక ఇప్పుడు ఆరోపణలు చేయడం బాధాకరం" అని లోకేశ్ అన్నారు. "ఏదో కూన రవికుమార్, ఎంపీ భరత్ వంటి వారు లేదా ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్‌లో ఉన్న నాయకులు సర్టిఫికెట్లు ఇచ్చేశారని, వాటిని ఆమోదించారని నిరాధార ఆరోపణలు చేస్తున్నారు. వాటికి ఆధారాలు ఉంటే బయటపెట్టాలి. శాప్ ఆధ్వర్యంలో స్పోర్ట్స్ కోటా భర్తీని ఎంతో పకడ్బందీగా పూర్తి చేశాం" అని ఆయన సభకు వివరించారు. క్రీడాకారుల భవిష్యత్తుపై ఉన్న అపోహలను తొలగించి, వారికి అన్ని విధాలా అండగా నిలవడమే తమ ప్రభుత్వ లక్ష్యమని లోకేశ్ పునరుద్ఘాటించారు.

## నాగబాబుకు కీలక పదవి..

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుం ది. జనసేన ఎమ్మెల్సీ, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సోదరుడు కొణిదెల నాగబాబుకు ప్రభుత్వం కీలక బాధ్యతలు అప్పగించింది. ఏపీ గ్రీన్ కార్యనిర్వాహక కమిటీ చైర్మన్‌గా నాగబాబును నియమిస్తూ, ఆయనకు కేబినెట్ హోదా కల్పిస్తూ రాష్ట్ర పర్యావరణ, అటవీశాఖ నుంచి అధికారిక ఉత్తర్వులు వెలువడ్డాయి.

రాష్ట్రవ్యాప్తంగా పచ్చదనాన్ని విశేషంగా పెంచడం, పర్యావరణ సమతుల్యతను కాపాడటం, అడవుల విస్తరణే లక్ష్యంగా పనిచేసే ఈ గ్రీన్ కార్యనిర్వాహక కమిటీకి నాగబాబు నేతృత్వం వహించనున్నారు. ఆయన సారథ్యంలో ఈ కమిటీ రాష్ట్రమంతటా విస్తృతంగా పర్యటిస్తూ పర్యావరణ పెంపొందింపు కార్యక్రమాలు, మొక్కలు నాటే భారీ ప్రాజెక్టుల పరిశీలన, పర్యవేక్షణను మరింత వేగవంతం చేయనుంది. పర్యావరణ పరిరక్షణకు మేలు చేకూరేలా కీలక కార్యక్రమాలను రూపొందించడంలో నాగబాబు నేతృత్వంలోని ఈ కమిటీ అత్యంత కీలక పాత్ర పోషించనుంది.

## మా నడిమిట్లకొస్తే ఒమన్‌పై బాంబేస్తాం

- మొదటి పేజి తరువాయి

కోసం ఇరాన్, ఒమన్‌ల మధ్య జరుగుతున్న చర్చల గురించి మీడియా అడిగిన సందర్భంలో ట్రంప్ ఈ కీలక హెచ్చరిక చేయడం గమనార్హం.

## నిజాలు బయటకు రావాలంటే సీబీఐ విచారణ ఒక్కటే సరైన మార్గం

- మొదటి పేజి తరువాయి

స్థాయిలో ధ్వజమెత్తింది. దీనిపై సభలో సమగ్ర చర్చ జరగాలని, బాధ్యత వహిస్తూ విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ తక్షణమే రాజీనామా చేయాలని శాసనమండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ డిమాండ్ చేశారు. నియామకాల్లో చోటుచేసుకున్న అవకతవకలు, స్పోర్ట్స్ కోటా కేటాయింపుల్లో అవకతవకల్లో నిజాలు బయటకు రావాలంటే సీబీఐ విచారణ ఒక్కటే సరియైన మార్గమని ఆయన స్పష్టం చేశారు. శాసనమండలిలో వైసీపీ ఇచ్చిన వాయిదా తీర్మానాన్ని చైర్మన్ తిరస్కరించడంతో సభలో ఒక్కసారిగా కలకలం రేగింది. కూటమి ప్రభుత్వం 'మెగా డీఎస్సీ' పేరుతో నిరుద్యోగులను 'దగా డీఎస్సీ'గా మోసం చేసిందని విపక్ష సభ్యులు నినాదాలతో హోరెత్తించారు. పరీక్షలు రాయని వారికి కూడా ఉద్యోగాలు ఇచ్చారనే ఆరోపణలు ఉన్నాయని, ఉద్యోగాల బేరసారాలకు సంబంధించిన ఆడియో టేపులు బయటకు వచ్చినా ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం వెనుక మర్మమేంటని బొత్స ప్రశ్నించారు. ప్రతిపక్షం లేవనెత్తిన ప్రశ్నలకు సమాధానం చెప్పలేక ప్రభుత్వం చర్చ నుంచి పారిపోతోందని విమర్శించారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన గ్రూప్-1 నియామకాలపై అధికార పక్షం చేస్తున్న ఆరోపణలనూ ప్రస్తావించారు. నిజంగా గ్రూప్-1లో అక్రమాలు జరిగాయని భావిస్తే, దానితో పాటు ప్రస్తుత డీఎస్సీ ప్రక్రియపై కూడా ఒకేసారి సీబీఐ విచారణ వేయాలని ఆయన సవాల్ విసిరారు. రాష్ట్రంలో మూడేళ్ల క్రితం నుంచి ఉద్యోగార్థులు ఎదురుచూస్తున్న తరుణంలో, మెరిట్ జాబితా నిర్వహణలో పారదర్శకత లోపించిందని దుయ్యబట్టారు.

# టీటీడీకి కోటి రూపాయల విరాళం

## కెబిఆర్ విద్యాసంస్థల జాయింట్ సెక్రెటరీ సి హెచ్ రామేశ్వరావు

**సి ఎస్ పురం, పెన్ పవర్ ఆగస్టు 17**

కదిరి బాబురావు వ్యవసాయ, ఉద్యాన కళాశాలల జాయింట్ సెక్రటరీ, రక్షత ఫార్మ కంపెనీ అధినేత చందన రామేశ్వర రావు కుటుంబ సభ్యులు, శ్రీ సాయి చందన ఏపిఐ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ డైరెక్టర్ ఉద్దగిరి తాతారావు లు కలిసి తిరుమల తిరుపతి దేవస్థానంనకు కోటి రూపాయలు విరాళాన్ని తి తి దే చైర్మన్ బి ఆర్ నాయుడు కు అందజేశారు.



పెన్ పవర్
MARKAPURAM మార్కాపురం
మార్కాపురం - ప్రకాశం

# నూతన జిల్లాకు భారీ బహుమతి

**ఎంఆర్‌కే యూడీఏ ఏర్పాటుకు జీవో విడుదల**

**21 మండలాలు, 507 గ్రామాలతో కొత్త అథారిటీ**

**జీవో 183 విడుదల 6,037చ.కి.మీ పరిధి**




**మార్కాపురం పెన్ పవర్ ఆగస్టు 17**

మార్కాపురం జిల్లా అభివృద్ధిలో చరిత్రాత్మక ముందడుగు పడింది. మార్కాపురాన్ని కేంద్రంగా చేసుకుని మార్కాపురం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (ఎంఆర్‌కే యూడీఏ)ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. జీవో ఎంఎస్ నం.183 ద్వారా ఈ మేరకు అధికారిక ప్రకటన వచ్చింది. రేపటి వరకు వేచి చూస్తారనుకున్న జీవో




ఈరోజే విడుదల కావడంతో జిల్లా ప్రజల్లో, నాయకుల్లో హర్షం వ్యక్తమవుతోంది.

**21 మండలాలు, 4 పట్టణాలు, 507 గ్రామాలు..**

ఎంఆర్‌కే యూడీఏ పరిధి ఏకంగా 6,037.39 చదరపు కిలోమీటర్లకు విస్తరించింది. ఇందులో మార్కాపురం, గిద్దలూరు, కనిగిరి మున్సిపాలిటీలు, పొదిలి నగర పంచాయతీతో పాటు 21 మండలాలు, 507 గ్రామాలు ఉంటాయి. గిద్దలూరు, బేస్తవారిపేట, రాచర్ల, కొమరోలు, కంభం, అర్ధవీడు, మార్కాపురం, తర్లపాడు, ఎర్రగొండపాలెం, పుల్లలచెరువు, త్రిపురాంతకం, దోర్నాల, పెద్దారవీడు, పొదిలి, కొనకనమిట్ల, హనుమంతునిపాడు, వెలిగండ్ల, కనిగిరి, పెదచెర్లపల్లి, చంద్రశేఖరాపురం, పామూరు మండలాలు ఈ పరిధిలోకి వస్తాయి.

**మాస్టర్ ప్లాన్ తో క్రమబద్ధ అభివృద్ధి...**

అథారిటీ పరిధిలో భూముల అభివృద్ధి, మాస్టర్ ప్లాన్, జోనల్ డెవలప్‌మెంట్ ప్లాన్ల తయారీ జరుగుతాయి. 2016 ఏపీ మెట్రోపాలిటన్ రీజియన్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీస్ చట్టం ప్రకారం భూ సేకరణ, విక్రయం, తనిఖీలు, అనుమతులు అన్నీ ఎంఆర్‌కే యూడీఏ ద్వారానే జరుగుతాయి. దీంతో రాబోయే రోజుల్లో జిల్లాలో అనధికార లేఅవుట్లకు చెక్ పడనుంది.

**మార్కాపురమే ప్రధాన కార్యాలయం..**

అథారిటీ ప్రధాన కార్యాలయం మార్కాపురంలోనే ఉంటుంది. వివిధ శాఖల నుండి డిప్యూటేషన్ పై సిబ్బందిని నియమిస్తారు. అథారిటీ ఖర్చులను సొంత ఆదాయంతోనే భరించాల్సి ఉంటుంది.

**ప్రభుత్వ నామినేటెడ్ బోర్డు..**

ఎంఆర్‌కే యూడీఏకు ప్రభుత్వం నియమించే చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్సన్ కమ్ సిఇఓ ఉంటారు. టౌన్ ప్లానింగ్ డైరెక్టర్ ప్రతినిధి, పురపాలక, ఆర్థిక శాఖల అధికారులు, జిల్లా కలెక్టర్ సభ్యులుగా ఉంటారు. పట్టణ ప్రణాళిక, పర్యావరణం, రవాణా రంగాల నిపుణులను కూడా సభ్యులుగా తీసుకునే అవకాశం ఉంటుంది.

**జిల్లా అభివృద్ధికి ఊతం..**

ఈ అథారిటీ ఏర్పాటుతో మార్కాపురం జిల్లాలో పట్టణీకరణ వేగం పెరగనుంది. రోడ్లు, డ్రైనేజీ, పార్కులు, పారిశ్రామిక కారిడార్లు, గృహ నిర్మాణ ప్రాజెక్టులు వేగంగా వస్తాయి. ప్రత్యేకించి వెలిగొండ నీరు వచ్చాక హార్టికల్చర్ హబ్ గా మారనున్న ఈ ప్రాంతానికి ఎంఆర్‌కే యూడీఏ మరింత బలం చేకూర్చనుంది. అధికారుల అంచనా ప్రకారం వచ్చే 2-3 ఏళ్లలో ఈ ప్రాంతంలో వేల కోట్ల పెట్టుబడులు వచ్చే అవకాశం ఉంది.

# మీకోసం 'అర్జీల పరిష్కారానికి అత్యధిక ప్రాధాన్యం ఇవ్వాలి

**- జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు**



**కలెక్టరేట్ పెన్ పవర్, ఒంగోలు ఆగస్టు 17**

' మీకోసం ' అర్జీల పరిష్కారానికి అత్యధిక ప్రాధాన్యమివ్వాలని జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు స్పష్టం చేశారు. ఈ దిశగా జిల్లా స్థాయి అధికారులు ప్రత్యేకంగా దృష్టి సారించి చర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశించారు. సోమవారం ప్రకాశం భవనంలో నిర్వహించిన ' మీకోసం ' కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కల్పనా కుమారి, డిఆర్ఓ పి.వెంకటరమణ, ఇతర అధికారులతో కలిసి ప్రజల నుంచి ఆయన అర్జీలను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో మొత్తం 284 అర్జీలు వచ్చాయి. వీటి పరిష్కారానికి తక్షణమే చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. కింద స్థాయి సిబ్బంది ఇచ్చే నివేదికలపై ఆధార పడకుండా జిల్లా స్థాయి అధికారి క్షేత్రస్థాయిలో పర్యటించి ఈ అర్జీల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆయన స్పష్టం చేశారు. శాఖాపరంగా పథకాల అమలును నిరంతరం పరిశీలిస్తూ ఉండాలన్నారు. ' మీకోసం ' అర్జీలకు పరిష్కారం, ఐ.వి.ఆర్.ఎస్. ఫోన్ కాల్స్ లో సానుకూల ప్రజాభిప్రాయం పెంపు కోసం ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తున్నందున అధికారులు కూడా ఇదే స్ఫూర్తితో మరింత చురుకుగా పనిచేయాలని కలెక్టర్ దిశానిర్దేశం చేశారు. అర్జీలకు సకాలంలో సహేతుక పరిష్కారం చూపాలని ఆయన స్పష్టం చేశారు. తమ స్థాయిలో పరిష్కరించలేని పక్షంలో అందుకు కారణాలను కూడా అర్జీదారులకు వివరించాలన్నారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ మాధురి, జిల్లా స్వర్ణ గ్రామ - స్వర్ణ వార్డు సచివాలయాల నోడల్ అధికారి వెంకటేశ్వరరావు, అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# దళితుల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక గ్రీవెన్స్

**ఎంఆర్పిఎస్ విజ్ఞప్తికి సానుకూలత**



**మార్కాపురం పెన్ పవర్ ఆగస్టు 17**

అత్యధిక దళిత జనాభా కలిగిన మార్కాపురం జిల్లాలో దళిత సామాజిక వర్గ ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక గ్రీవెన్స్ ఏర్పాటు చేయాలని ఎంఆర్పిఎస్ నాయకులు నేదరపల్లి జయరాజు జిల్లా కలెక్టర్ విజయసునీతకి వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో దళిత జనాభా ఎక్కువగా ఉందని, కానీ సాధారణ వినతి ద్వారా వారి సమస్యలు పరిష్కారం కావడం లేదని తెలిపారు. పల్లెల్లో, పట్టణాల్లో స్మశాన వాటికలు, తాగునీరు, వీధి దీపాలు, మురుగు కాలువలు, రోడ్లు వంటి కనీస సౌకర్యాలు లేవని చెప్పారు. భూ గొడవలు, భూ సమస్యలు, దళితులపై దాడులు, మహిళలపై వేధింపులు వంటి వ్యక్తిగత సమస్యలు కూడా అనేకం ఉన్నాయని వివరించారు. ప్రభుత్వం ఇచ్చే ప్రత్యేక నిధులు కూడా సరిగా అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.ఈ సమస్యలన్నింటినీ పరిష్కరించాలంటే ప్రత్యేక వినతి వేదిక తప్పనిసరి అని, ప్రతి నెలలో ఒక వారం ప్రత్యేక వినతి నిర్వహించాలని కోరారు. ఎంఆర్పిఎస్ విజ్ఞప్తిపై వెంటనే స్పందించిన అదనపు కలెక్టర్ పులి శ్రీనివాసు వచ్చే నెల నుండి ప్రత్యేక వినతి నిర్వహిస్తామని హామీ ఇచ్చారు.

# స్పందన ఉండదు ...సాయం అందదు..

**- గ్రీవెన్స్ సెల్ కన్నా మయసభ నయం..**

**- శాఖల వారీగా నామ సూచికలు ఏర్పాటు చేయాలని అర్జీదారుల విన్నపం..**





**కలెక్టరేట్ పెన్ పవర్, ఒంగోలు ఆగస్టు 17**

జిల్లా కలెక్టర్ దృష్టికి తమ సమస్యను తెలుసుకుని వెళితే పరిష్కారం అవుతుంది అన్న ఒక విశ్వాసంతో ప్రజలు జిల్లా నలుమూలల సుదూర ప్రాంతాల నుండి జిల్లా కేంద్రమైన ఒంగోలు నగరానికి వచ్చి ప్రకాశం భవనం కలెక్టరేట్ చిరునామాన్ని కనుక్కుంటూ చివరి కంటూ గమ్యం చేరుకుంటారు. వచ్చే వారందరూ చదువుకున్న వారు కాదు అందులో చాలామంది చదువు లేని వారు తమ సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకునేందుకు వస్తారు. కలెక్టరేట్లోని పిజిఎస్ భవనం వద్దకు రాగానే మయసభ కన్నా ఘోరంగా కట్ పరిస్థితులు వారి కంటపడతాయి ఎటువైపు వెళ్లి ఏ సమస్యకు అర్జీ వ్రాయించుకోవాలో తెలియక అక్కడే చక్కర్లు కొడుతూ గంటల సమయాన్ని వృధా చేసుకుంటూ అలసి సొలసిపోతారు. ఎవరో ఒకరు గమనించి లేదా ఎవరో ఒకరు వారికి అర్జీ రాసి పెడితే అక్కడనుండి జిల్లా కలెక్టర్ వద్దకు వెళ్లి అర్జీని అందిస్తారు ఇలా ప్రతి సోమవారం జరుగుతున్న తంతు. జిల్లా కలెక్టర్ ఎంతో ఉదాహరణతో గతంలో ఎన్నడూ లేనివిధంగా అర్జీ దారుల్లో చదువు తక్కువ ఉన్నవారు అర్జీలు రాయలేని వారు అలాంటి వారి కోసం అర్జీలు రాసి పెట్టేందుకు తగిన సిబ్బందిని ఏర్పాటు చేశారు కానీ ఏ అర్జీ ఎక్కడ వ్రాయాలో నామఫలకాలు మాత్రం పెట్టకపోవడంతో అర్జీదారుల అవస్థలు అన్నీ ఇన్నీ కావు. సమయం గడిచిపోతుంది అన్న ఆదుర్దాతో జిల్లా కలెక్టరేట్ బయట కొంతమంది వద్ద ఎంతో మంది అర్జీదారుడు 50 రూపాయలు లేదా వంద రూపాయలు ఖర్చుపెట్టి అర్జీని రాయించుకున్న దాఖలాలు కూడా ఉన్నాయని తెలుస్తుంది. జిల్లా కలెక్టర్ ఎంతో పెద్ద మనసుతో అర్జీదారులకు ఎలాంటి సమస్య రాకూడదు వారి సమస్యను పరిష్కారం చూపాలన్న దొడ్డ మనసును చాటుతూ ఎన్నో వసతులు ఏర్పాటు చేసిన కూడా కింది స్థాయి సిబ్బంది ఆచరణలో విఫలం అవుతుడడంతో అర్జీదారుడు అవస్థలు పడుతుండడం ఇక్కడ పరిపాటిగా మారింది. ఇప్పుడైనా ఉన్నతాధికారులు అర్జీదారుడి ఏ సమస్యపై వస్తే ఆ సమస్య తాలూకు అధికారి విభాగానికి అర్జీలు రాసి ఇచ్చేలా నామఫలకాలు ఏర్పాటు చేసి వారికి అవసరమైన సదుపాయాలు కల్పించాలని జిల్లా కలెక్టర్ ని కోరుతున్నారు.

# మాకు న్యాయం చేయాలి

*వీఆర్వో స్టేట్మెంట్‌తో మా తండ్రి వారసత్వ ఆస్తి*

*మరొకరికి రిజిస్ట్రేషన్ చేయించారు*

*జిల్లా కలెక్టర్ కు వినతిపత్రం అందజేసిన*

*ముతకని కుమారి,కామినేని రాజేశ్వరి*



**లింగసముద్రం పెన్ పవర్, ఆగస్టు 17**

లింగసముద్రం మండలం అన్నేబోయిన పల్లి గ్రామం లో మా తండ్రి నుండి ఉన్న వారసత్వ ఆస్తిని గ్రామ విఆర్వో స్టేట్మెంట్ తో మరొకరు రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని మాకు న్యాయం చేయాలని జిల్లా కలెక్టర్ కు ముతకని కుమారి కామినేని రాజేశ్వరి సోమవారం ఒంగోలు లోని పీ జీ ఆర్ ఎస్ లో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ లింగసముద్రం మండలం అన్నేబోయిన పల్లి గ్రామంలో మా తండ్రి చొప్పర యర్రయ్య ఇల్లు 750చదరపు అడుగుల స్లాబు, 390చదరపు అడుగుల రేకుల పంచ, 80చదరపు రేకుల బాతు రూము, ప్రహరీ గోడ 100అడుగులు ఉన్నది. మా తండ్రిచొప్పర యర్రయ్య గతంలో మాకు కొంత భూమి ఇల్లు లో ఆడపిల్లలకు ఇస్తాను అని చెప్పి ఉన్నారు తదుపరి మా తల్లిదండ్రులు మరణించారు.అయితే మా తండ్రి కి చెందిన ఇల్లు, ఇంటి స్థలం మా సోదరులుచొప్పర మాలకొండయ్య తండ్రి యర్రయ్య తల్లిదండ్రుల మరణ ధ్రువీకరణ పత్రములు కుటుంబ సభ్యుల ధ్రువీకరణ పత్రం లేకుండా గ్రామ వీఆర్వో స్టేట్మెంట్ తో తన కుమారుడు అయిన చొప్పర మహేష్ తండ్రి మాలకొండయ్య రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు.ఎలాంటి ఆధారాలు లేకుండా స్టేట్మెంట్ ఇచ్చిన అన్నేబోయినపల్లి గ్రామ వీఆర్వో మల్లికార్జున పై చర్యలు తీసుకొని మాకు న్యాయం చేయగలరని కోరుకుంటూ తప్పుడు రిజిస్ట్రేషన్ ను రద్దుపరిచి విచారణ జరిపి న్యాయం చేయాలని కలెక్టర్ ను కోరారు. స్పందించిన కలెక్టర్ విచారణ జరిపి న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు.

# గ్రూప్ -1 అవకతవకల నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకే డీఎస్సీపై దుష్ప్రచారం

**-జగన్ హయాంలో గ్రూప్-1 పరీక్షల్లో అక్రమాలపై సిట్ నివేదిక వచ్చింది**

**-ఆరోపణల్లో నిజముంటే అసెంబ్లీకి వచ్చి చర్చించాలి -పోకూరి రాంబాబు**

**-డీఎస్సీపై చర్చకు మంత్రి నారా లోకేష్ సిద్ధం**



**కందుకూరు పెన్ పవర్, ఆగస్టు 17**

మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో నిర్వహించిన ఏపీపీఎస్సీ గ్రూప్--1 పరీక్షల్లో జరిగినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న అవకతవకల నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకే మెగా డీఎస్సీ నియామకాలపై వైఎస్సార్‌సీపీ నేతలు దుష్ప్రచారం చేస్తున్నారని ఆంధ్రప్రదేశ్ విద్య, సంక్షేమ మౌలిక వసతుల అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ పోకూరి రాంబాబు ఆరోపించారు. జగన్ ప్రభుత్వ హయాంలో నిర్వహించిన గ్రూప్--1 పరీక్షల్లో ఎంపికైన 165 మంది అభ్యర్థుల్లో 160 మంది జవాబు పత్రాల్లో మార్పులు, చేర్పులు జరిగినట్లు, 61 మంది ఓఎంఆర్ షీట్లలో వైటనర్‌తో దిద్దుబాట్లు జరిగినట్లు సిట్ తన నివేదికలో పేర్కొన్నదని ఆయన తెలిపారు. ఈ వ్యవహారంపై సిట్ నివేదికను హైకోర్టుకు సమర్పించిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు.

**మెగా డీఎస్సీపై నిరాధార ఆరోపణలు వద్దు...**

అడుగడుగునా ప్రతిభావంతుల అవకాశాలను దెబ్బతీసిన గత ప్రభుత్వంపై ఉన్న ఆరోపణలు బయటకు వస్తున్న నేపథ్యంలో, ఎంతో పారదర్శకంగా నిర్వహించిన మెగా డీఎస్సీ నియామకాలపై వైసీపీ నేతలు ఆరోపణలు చేయడం దృష్టి మళ్లింపు రాజకీయాల్లో భాగమేనని రాంబాబు విమర్శించారు. మెగా డీఎస్సీలో అవినీతి జరిగిందని ఆరోపిస్తూ ఉపాధ్యాయులు, నిరుద్యోగులు, అభ్యర్థుల ప్రతిభను అవమానించేలా మాట్లాడితే సహించేది లేదని ఆయన హెచ్చరించారు. రాష్ట్రవ్యాప్తంగా ఉపాధ్యాయులు స్పందిస్తున్న తీరు చూసి వైసీపీ నేతల్లో ఆందోళన మొదలైందని అన్నారు.

**అసెంబ్లీకి వచ్చి చర్చించాలి...**

"పదేపదే ఆరోపణలు చేసినంత మాత్రాన అవి నిజాలు కావు. ఆరోపణల్లో నిజముంటే యువత, నిరుద్యోగులపై నిజంగా ప్రేమ ఉంటే అసెంబ్లీకి వచ్చి ప్రజల తరఫున ప్రశ్నించాలి అని రాంబాబు అన్నారు.

రెండేళ్లుగా ప్రజాధనంతో జీతాలు, ఇతర సౌకర్యాలు పొందుతూ అసెంబ్లీ సమావేశాలకు దూరంగా ఉండటం సరికాదని ఆయన విమర్శించారు. ఆరోపణల్లో వాస్తవం ఉంటే సభలో చర్చకు రావాలని, సమాధానం చెప్పే ధైర్యం, నిజాయితీ కూటమి ప్రభుత్వానికి ఉందని స్పష్టం చేశారు.

**డీఎస్సీపై చర్చకు లోకేష్ సిద్ధం...**

రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ డీఎస్సీ అంశంపై అసెంబ్లీలో చర్చకు సిద్ధంగా ఉన్నారని రాంబాబు తెలిపారు. ఇకనైనా "డైవర్షన్ పాలిటిక్స్"కు స్వస్తి పలికి వైసీపీ నేతలు, ఎమ్మెల్యేలు అసెంబ్లీకి హాజరై తమ ఆరోపణలను ఆధారాలతో ప్రజల ముందుంచాలని సూచించారు. ఆరోపణలకు సమాధానం ఇచ్చేందుకు కూటమి ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఆయన స్పష్టం చేశారు.

# ప్రముఖ వ్యాపారవేత నాయబ్ రసూల్ (బడే) కు ఏపీటీఎఫ్ నాయకుల సన్మానం

**సి ఎస్ పురం,పెన్ పవర్, ఆగస్టు 17**

కోవిలంపాడులో ప్రముఖ వ్యాపారవేత్త షేక్ నాయబ్ రసూల్ (బడే )ను ఏపీటీఎఫ్ సి.ఎస్.పురం మండల శాఖ నాయకులు సోమవారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పమాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఏపీటీఎఫ్ నాయకులు మాట్లాడుతూ నాయబ్ రసూల్ సమాజానికి అందిస్తున్న సేవలను ఏపీటీఎఫ్ నాయకులు కొనియాడారు. రాబోయే రోజుల్లో కూడా సమాజ అభివృద్ధికి మరింతగా ఉపయోగపడే సేవా కార్యక్రమాలు చేపట్టి మంచి పేరు ప్రఖ్యాతలు సంపాదించాలని ఆకాంక్షించారు. సమాజసేవే లక్ష్యంగా ముందుకు సాగుతున్న సేవాభావులను ప్రోత్సహించడం ప్రతి ఒక్కరి బాధ్యతని అన్నారు ఈ కార్యక్రమంలో ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షులు షేక్ నాయబ్ రసూల్, మండల శాఖ అధ్యక్షులు తోట శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శి జె ఎస్ ఆనంద్ బాబు, నాయకులు ఇండ్ల ప్రసాద్, దండే శ్రీనివాసులు, డి. సుబ్బరాయుడు, ఎన్. గంగాధర్, గాంధీ, చాంద్ బాషా, ఏ సాయి, జి



సురేష్, గాలి రవీంద్ర, మధుబాబు, బి శ్రీనివాసులు, జి పుల్లయ్య, ఖాజా



రహంతుల్లా, ఎన్.వి. నారాయణ, షబ్బీర్, బి విష్ణు నారాయణ, సి ఆర్ పి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

## నారాయణస్వామి ఆదివారం ఆదాయం రూ. 1,68,584/- లు



**సి ఎస్ పురం, పెన్ పవర్ ఆగస్టు 17**

జిల్లాలో ప్రసిద్ధిగాంచిన ప్రముఖ పుణ్యక్షేత్రమైన మిట్టపాలెం నారాయణ స్వామి ఆలయమునకు ఆదివారం ఆదాయం రూ.1,68,584/- లు వచ్చినట్లు ఆలయ కార్యనిర్వాహణాధికారి గిరిరాజు నరసింహబాబు తెలిపారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టిక్కెట్లు అమ్మకం ద్వారా జమ రూ. 85,560/- లు, లడ్డు ప్రసాదం అమ్మకం ద్వారా జమ రూ. 37,680/-, శాశ్వత అన్నదాన పథకం నకు ద్వారా విరాళములు రూ.21,696/-లు, పంచామృత అభిషేకమునకు రూ.11,032/- లు, స్వామివారికి శ్రీపాద కానుకలు వలన రూ.5,116/- లు, స్వామివారి ఉచిత ప్రసాదమునకు విరాళముల ద్వారా రూ.7,500/- లు వచ్చినట్లు తెలిపారు.

## పోలీసు 'మీకోసం'లో 68 ఫిర్యాదులు



**క్రైమ్ రిపోర్టర్ పెన్ పవర్, ఒంగోలు ఆగస్టు 17**

సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లా ఎస్పీ.. పోలీస్ అధికారులు ప్రజా ఫిర్యాదుల పరిష్కార కార్యక్రమం (మీకోసం) ను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 68 ఫిర్యాదులు అందాయి. ఫిర్యాదుదారులు తమ సమస్యలను జిల్లా ఎస్పీ కి వివరించి, సంబంధిత వ్రాతపూర్వక అర్జీలను అందించారు. ఫిర్యాదు దారులతో అధికారులు ముఖాముఖిగా మాట్లాడి, వారి సమస్యల పూర్తి వివరాలను, వారి ఫిర్యాదుల నేపథ్యాన్ని తెలుసుకొని, వాటిని చట్టపరంగా త్వరితగతిన పరిష్కరిస్తామని భరోసా ఇచ్చారు. మీకోసం కార్యక్రమంలో వచ్చిన ఫిర్యాదుల విషయంలో ఎలాంటి అలసత్వం చూపకుండా, నిర్ణీత గడువులోనే పరిష్కారం అందించాలని అధికారులను జిల్లా ఎస్పీ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ప్రధానంగా సివిల్, భూ, ఆర్థిక తగాదాలు, చీటింగ్, అత్తరింటి వేదింపులు తదితర అంశాలకు సంబంధించిన ఫిర్యాదులు వచ్చాయి. ఈ కార్యక్రమంలో సింగరాయకొండ సీఐ శ్రీహరి, కొండేపి సీఐ రమణయ్య, అద్దంకి రూరల్ సీఐ మల్లికార్జున రావు, ప్యానెల్ అడ్వొకేట్ బి.బాలాజీ సింగ్, సమస్యల పరిష్కార వేదిక ఎస్సై యాస్మిన్, సిబ్బంది పాల్గొన్నారు.

## రైతులకు క్షేత్రదర్శిని పత్తి, రైస్ మిల్లులో ప్రదర్శన





**గిద్దలూరు పెన్ పవర్ ఆగస్టు 17**

గిద్దలూరు సబ్ డివిజన్ పరిధిలోని గిద్దలూరు, రాచర్ల, కొమరోలు బెస్తవారిపేట మండలాలకి సంబందించిన రైతులను వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ(ఆత్మ) ఆధ్వర్యంలో క్షేత్ర సందర్శనకి మురారి పత్తి జిన్నింగ్ మిల్లు, డిబిఎస్ రైస్ మిల్లు, జాతీయ విత్తనాభివృద్ధి సంస్థ నంద్యాల కి తీసుకొని వెళ్ళారు. అక్కడ పత్తి తీసేటప్పుడు వ్యర్థాలు పుల్లలు, పొగాకు చూర, ప్లాస్టిక్ వ్యర్థాలు లేకుండా చూసుకోవాలని,కొంతమంది నీళ్లు చల్లి పత్తి అమ్మడం వలన ధర కూడా తక్కువగా ఉంటుంది అని కావున అధిక ధర పొందాలంటే ఇవి లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.జాతీయ విత్తనాభివృద్ధి సంస్థ అధికారి మోహన్ రాజు విత్తన ప్రాసెసింగ్ యూనిట్ లో విత్తనాలు శుభ్రం చేసి నాణ్యమైన విత్తనాలు తయారు చేయడం, పంట కోత అనంతరం విత్తనాలు నిల్వ,శనగలు, కందులు,జొన్న,కొర్రలు మొదలైనవి విత్తన ప్రాసెసింగ్ విధానం గురించి తెలిపారు. ఈ కార్యక్రమం లో సహాయ వ్యవసాయ సంచాలకులు గిద్దలూరు కె. రాజశ్రీ, మండల వ్యవసాయాదికారి గిద్దలూరు విజయ భాస్కర్ రెడ్డి, ఆత్మ సిబ్బంది వాణి, గ్రామ వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

# అధైర్య పడొద్దు...!

## కండరాల పెరుగుదల వ్యాధి బాలుని కుటుంబానికి కలెక్టర్ రాజాబాబు భరోసా



**స్టాఫ్ రిపోర్టర్ పెన్ పవర్, ఒంగోలు ఆగస్టు 16**

అరుదైన కండరాల అసాధారణ పెరుగుదల వ్యాధితో బాధపడుతూ నడవలేని స్థితిలో వీల్ చైర్ కు పరిమితమైన ఆ బాలుడిని చూసి జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు చలించిపోయారు. బాలుని పరిస్థితిని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి అవసరమైన సహాయం అందేలా చూస్తామని భరోసా ఇచ్చారు. సంతమాగులూరు మండలం కొప్పెరం గ్రామం నుంచి సహాయం కోసం సోమవారం కలెక్టరేట్లో ' మీకోసం ' కార్యక్రమానికి వచ్చిన ఆ బాలుని పేరు వల్లెపు పవన్ కిషోర్. వయస్సు 11 సంవత్సరాలు. ఆరేళ్ల వయసులోనే ఈ అరుదైన వ్యాధి బారిన పడినట్లు తల్లిదండ్రులు తెలిపారు. అసాధారణ స్థాయిలో వయసుకు మించి కండరాలు పెరుగుతున్నాయని, ఫలితంగా తన పని తాను చేసుకోలేని స్థితిలో ఉన్నాడని, తన బిడ్డ ఆరోగ్యాన్ని సాధారణ స్థితికి తీసుకొచ్చేందుకు అవసరమైన సహాయం చేయాలని బాలుని తల్లిదండ్రులు వెంకటేశ్వర్లు, విజయలక్ష్మి కలెక్టర్ ను కోరారు. తమ స్థాయికి మించి ఇప్పటికే రూ.7 లక్షలను వైద్యం కోసం ఖర్చు చేసామన్నారు. దీనితో బాలుని ఆరోగ్య పరిస్థితిపై డిఎంహెచ్ఓ వెంకటేశ్వర్లు ద్వారా కలెక్టర్ వివరాలు తెలుసుకున్నారు. జన్యులోపం వలన ఈ పరిస్థితి వచ్చిందని, నయం చేసేందుకు రూ.26 కోట్ల ఖరీదైన ఇంజక్షన్ చేయాల్సి ఉంటుందన్నారు. దీనిపై కలెక్టర్ స్పందిస్తూ బాలుని పరిస్థితిని రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్లేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అదేవిధంగా వెల్లూరులోని క్రిస్టియన్ మెడికల్ కాలేజీలో కూడా ఫిజియోతెరపి చేయించేలా చూడాలని చెప్పారు. ప్రభుత్వం తరపున అవసరమైన సహాయం చేసేలా చూస్తామని బాలుని తల్లిదండ్రులకు కలెక్టర్ భరోసా ఇచ్చారు.

# జర్నలిస్టుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలి

**పుల్లల చెరువు పెన్ పవర్ ఆగస్ట్ 17**

రాష్ట్రవ్యాప్తంగా జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించి, వారి సంక్షేమానికి ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (ఏపీయూడబ్ల్యూజే) సంఘ సభ్యులు కోరారు.జర్నలిస్టుల హక్కులు, సంక్షేమం, రక్షణకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇవ్వాలని వారు విజ్ఞప్తి చేశారు.ఏపీయూడబ్ల్యూజే యూనియన్ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం పుల్లలచెరువు జర్నలిస్ట్ యూనియన్ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయంలో కార్యక్రమం నిర్వహించారు. అనంతరం పుల్లలచెరువు జర్నలిస్ట్ యూనియన్ అధ్యక్షుడు ఆరేవుల యేసోబు ఆధ్వర్యంలో జర్నలిస్టుల బృందం తహసీల్దార్ మల్లిఖార్జున్ నాయుడును కలిసి వినతిపత్రం అందజేసింది.ఈ సందర్భంగా జర్నలిస్టులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను తహసీల్దార్ దృష్టికి తీసుకెళ్లారు.ముఖ్యంగా రాష్ట్రంలో జర్నలిస్టులు మరియు వారి కుటుంబ సభ్యులకు మెరుగైన వైద్య సేవలు అందేలా నూతన ఆరోగ్య విధానాన్ని అమలు చేయాలని కోరారు.అదేవిధంగా అర్హులైన జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు మంజూరు చేయడం, హెల్త్ కార్డుల సమస్యను పరిష్కరించడం, విధి నిర్వహణలో జర్నలిస్టులకు రక్షణ కల్పించేందుకు ప్రత్యేక రక్షణ చట్టం తీసుకురావడం, వృత్తి నుంచి విరమించిన జర్నలిస్టులకు గౌరవప్రదమైన జీవనం సాగించేందుకు పెన్షన్ పథకాన్ని అమలు చేయడం వంటి అంశాలను వినతిపత్రంలో ప్రస్తావించారు.ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా పనిచేస్తూ నిత్యం ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకువస్తున్న జర్నలిస్టుల సంక్షేమాన్ని ప్రభుత్వం విస్మరించరాదని ఈ సందర్భంగా యూనియన్ నాయకులు పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో పనిచేస్తున్న



జర్నలిస్టులు ఆర్థికంగా అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వారికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు.ఏపీయూడబ్ల్యూజే యూనియన్ 70 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా రాష్ట్ర, జిల్లా శాఖల పిలుపు మేరకు జర్నలిస్టుల ప్రధాన డిమాండ్ల పరిష్కారం కోసం ప్రభుత్వానికి వినతిపత్రాలు సమర్పిస్తున్నట్లు నాయకులు తెలిపారు. జర్నలిస్టుల సంక్షేమం, వృత్తిపరమైన భద్రత, విధి నిర్వహణలో ఎదురయ్యే సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించాలని విజ్ఞప్తి చేశారు.వినతిపత్రాన్ని స్వీకరించిన తహసీల్దార్ మల్లికార్జున నాయుడు జర్నలిస్టుల సమస్యలను పరిశీలించి పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చినట్లు యూనియన్ నాయకులు తెలిపారు.జర్నలిస్టుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని మండల గౌరవ అధ్యక్షుడు గురునాథం తెలిపారు. జర్నలిస్టుల హక్కులు, సంక్షేమం కోసం యూనియన్ నిరంతరం పోరాడుతుందని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో వెంకోట్రావు,గురునాథం, నాగేంద్ర బాబు, మరియదాసు,యర్రగురవయ్య,జర్నలిస్టులు పాల్గొన్నారు.

## వెలుగొండ బాధితులకు పునరావాసం...

# ఉపాధి అవకాశాలు కల్పించాలి

### వైసీపీ నేత సయ్యద్ గౌస్ మోహిద్దీన్ డిమాండ్

**మార్కాపురం పెన్ పవర్ ఆగస్టు 17**

వెలిగొండ ప్రాజెక్టు కింద భూములు తమ ఆస్తులను కోల్పోయిన బాధితులకు పునరావాసం ఉపాధి అవకాశాలు వెంటనే కల్పించాలని వైసీపీ మైనార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి సయ్యద్ గౌస్ మోహిద్దీన్ కూటమి ప్రభుత్వన్ని డిమాండ్ చేశారు. వైసిపి హయాంలో 90 శాతం పూర్తి చేసుకున్న వెలుగొండ ప్రాజెక్టును మిగిలిన అరకురా పనులను పూర్తి చేసి తామే అంత చేశామని భుజాలు ఎగరేస్తున్న కూటమి సర్కార్ వెలుగొండ భూములు కోల్పోయిన బాధితులను విస్మరించడం సూచనీయమని అయన విమర్శించారు.



ప్రాజెక్టు కింద ఆస్తులు కోల్పోయిన బాధితులను పట్టించుకోకుండా ప్రాజెక్టు ప్రారంభోత్సవానికి ఉత్సాహం చూపుతున్న కూటమి సర్కార్ చిత్తశుద్ధి నష్టపోయిన వారిపట్ల ఎలా ఉందో అర్థమైపోతోందని అని అయన విమర్శించారు. కొందరు ఈ ప్రాజెక్టు కింద ఉపాధి కోల్పోగా కొందరు తమ ఆస్తులను నివాసాలను ఇలా అన్ని రకాలుగా నష్టపోయిన బాధితులు ఉన్నారని, వారందరికీ వారు నష్టపోయిన దానికి ప్రత్యామ్నాయం చూపి పునరావాసం కల్పించాలని సయ్యద్ గౌస్ మోహిద్దీన్ డిమాండ్ చేశారు. వైసిపి హయాంలో పూర్తి చేసుకున్న వెలుగొండ ప్రాజెక్టును ప్రారంభించేందుకు ఉత్సాహం చూపుతున్న కూటమి సర్కార్ ముందుగా బాధితుల సమస్యలపై వారి పునరావసం ఉపాధి పై శ్రద్ధ పెడితే బాగుంటుందని ఆయన సూచించారు. బాధితులకు పునరావాసం ఉపాధి కల్పన చేయకుండా కేవలం ప్రాజెక్టు ప్రారంభోత్సవానికి ఉత్సాహం చూపితే మాత్రం కూటమి సర్కార్ యొక్క కుటిల నీతి బహిర్గతమవుతుందని స్పష్టం చేశారు. వెలుగొండ ప్రాజెక్టు బాధితులను ఆదుకోకుండా కేవలం ప్రాజెక్టు ప్రారంభోత్సవానికి పూనుకుంటే వైసిపి చూస్తూ ఊరుకోదని ఆయన హెచ్చరించారు. ప్రాజెక్టు బాధితులకు న్యాయం జరిగే వరకూ వారి పక్షాన పోరాడుతామని సయ్యద్ గౌస్ మోహిద్దీన్ స్పష్టం చేశారు. ఇప్పటికైన కూటమి ప్రభుత్వం వెలుగొండ భాధితులకు వేంటనే పునరావాసం కల్పించి వారికి నష్ట పరిహారం చెల్లించిన తరువాతే వెలుగొండ ప్రారంభోత్సవం పై దృష్టి పెట్టాలని కూటమి ప్రభుత్వంన్ని కోరారు.

## కలెక్టర్ చేతుల మీదుగా ప్రశంసా పత్రం..

### గిద్దలూరు కమిషనర్ రమణబాబుకు జర్నలిస్టుల శుభాకాంక్షలు



**గిద్దలూరు పెన్ పవర్ ఆగస్టు 17**

గిద్దలూరు పురపాలక సంఘం ఉత్తమ కమిషనర్గా ఎంపికై, ఆగస్టు 15న జిల్లా కలెక్టర్ ఎం. విజయ సునీత చేతుల మీదుగా ప్రశంసా పత్రం అందుకున్న పురపాలక కమిషనర్ ఈ.వి. రమణబాబును సోమవారం పురపాలక కార్యాలయంలో స్థానిక జర్నలిస్టులు ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు . ఈ సందర్భంగా జర్నలిస్టులు మాట్లాడుతూ.. పురపాలక సంఘ అభివృద్ధి, ప్రజలకు మెరుగైన సేవలు అందించడంలో కమిషనర్ రమణబాబు చేస్తున్న కృషిని అభినందించారు. ఉత్తమ కమిషనర్గా ప్రశంసా పత్రం అందుకోవడం గిద్దలూరు పురపాలక సంఘానికి గర్వకారణమని పేర్కొన్నారు.

## మున్సిపల్ కార్మికులను రెగ్యులర్ చేయాలని అసెంబ్లీ సమావేశంలో నిర్ణయం చేయాలి



**గిద్దలూరు పెన్ పవర్ ఆగస్టు 27**

గిద్దలూరు మున్సిపల్ ఆఫీస్ దగ్గర మున్సిపల్ వర్కర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్మికులు మున్సిపల్ కార్యాలయం వద్ద తమ డిమాండ్ల కోసం సోమవారం మానవహారం తో నిరసన తెలియజేశారు ఈ సందర్భంగా మున్సిపల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు పి పాపయ్య మాట్లాడుతూ అసెంబ్లీ సమావేశాల్లో మున్సిపల్ కార్మికులకు ఇచ్చిన హామీ ని అమలు చేయాలని ప్రభుత్వ అసెంబ్లీ సమావేశంలో తీర్మానం చేయాలని డిమాండ్ చేశారు. కనీస వేతనం 26 వేలు ఇవ్వాలని , సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని మున్సిపల్ కార్మికులందరినీ రెగ్యులర్ చేయాలని గతంలో ప్రభుత్వం ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. సమస్య పరిష్కారం చేయని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని అన్నారు. ఈ నిరసన కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు కె శోభ, పి రవి, డి రంగయ్య, ప్రవీణ్, కన్నయ్య చెన్నమ్మ, సుబ్బమ్మ తదితరులు పాల్గొన్నారు.

## 19న జె.పి చెరువు శ్రీ నెమలిగుండ్ల రంగని ఆలయ భూముల కౌలుకు వేలంపాటలు

**గిద్దలూరు,పెన్ పవర్,ఆగస్ట్ 17**

మార్కాపురం జిల్లా రాచర్ల మండలం జె.పి చెరువు శ్రీ నెమలిగుండ్ల రంగనాయక స్వామి వారి ఆలయ భూముల కౌలుకు ఈ నెల 19న ఆలయ భూమి ఉన్న ఆయా గ్రామాల్లో బహిరంగ వేలంపాటలు నిర్వహిస్తున్నట్లు ధర్మకర్తల మండలి చైర్మన్ సిద్ధం నరసింహులు, ఆలయ కార్యనిర్వహణాధికారి ఎం. నాగయ్య ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. 2026-27నుంచి 2028-29 వరకు మూడేళ్ల నిర్దిష్ట కాలపరిమితికి ఈ కౌలు పాట అమలులో ఉంటుంది. ఈ పాటలను ఉదయం 10 గంటలకు అనుములవీడు రామాలయంలో,10.30 కు పాలకవీడు,11కు రామాపురం 11.30కు సోమిదేవుపల్లె రామాలయాల్లో మధ్యాహ్నం 12.30 గంటలకు గిద్దలూరు మండలం అంబవరం రామాలయంలో,3 గంటలకు అర్ధవీడు మండలం రంగాపురం గ్రామాల్లోని రామాలయాల్లో వేలంపాటలు నిర్వహిస్తారు. ఆసక్తి ఉన్న రైతులు రెండు వేల రూపాయల ధరావత్తు చెల్లించి నేరుగా వేలం పాటలో పాల్గొనవచ్చు. హెచ్చుపాటదారు ఆ మొత్తాన్ని వెంటనే చెల్లించాల్సి ఉంటుంది.



# ఘనంగా ఎపియుడబ్లూజే 70వ వార్షికోత్సవ వేడుకలు




## జర్నలిస్టుల సంక్షేమమే లక్ష్యం - ఎన్.వి.రమణ

## రోగులకు పండ్లు పంపిణీ, కేక్ కటింగ్

**మార్కాపురం పెన్ పవర్ ఆగస్టు 17**

ఎపియుడబ్లూజే 70వ వార్షికోత్సవ వేడుకలు సోమవారం స్థానిక ప్రెస్ క్లబ్ లో ఘనంగా జరిగాయి. ఉమ్మడి ప్రకాశం జిల్లా అధ్యక్షులు ఎన్.వి.రమణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకుల సమక్షంలో కేక్ కట్ చేసి స్వీట్లు పంచారు. ఈ సందర్భంగా ఎన్.వి.రమణ మాట్లాడుతూ 1957 ఆగస్టు 17న మానికొండ చలపతి రావు చేతుల మీదుగా స్థాపించిన ఎపియుడబ్లూజే గత ఏడు దశాబ్దాలుగా జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కోసం, వారి సంక్షేమం కోసం పోరాటం చేస్తోందని తెలిపారు. ప్రభుత్వానికి, ప్రజలకు వారధిగా వ్యవహరిస్తూ



పత్రికా స్వేచ్ఛ, పత్రికా ప్రమాణాల పరిరక్షణకు కృషి చేస్తోందని చెప్పారు. ఇటీవల పత్రికా స్వేచ్ఛపై దాడులు పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. అర్హులైన విలేకరులకు నివాస స్థలాలు, గుర్తింపు కార్డులు, ఆరోగ్య బీమా పథకాన్ని పునరుద్ధరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

**వైద్యశాలలో పండ్ల పంపిణీ..**

ఎపియుడబ్లూజే ఆధ్వర్యంలో జిల్లా ప్రభుత్వ వైద్యశాలలో రోగులకు పండ్లు, బ్రెడ్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సిఐ ఎస్.కె.అల్తాఫ్ హుస్సేన్, వైద్యశాల ఇంచార్జి సూపరింటెండెంట్ శ్రీనివాస్ హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా సహాయ కార్యదర్శి బంకా శ్రీనివాసరావు, ఐజేయు మాజీ సభ్యులు జి ఎల్ నరసింహారావు, ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్ట్ అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షులు ఎస్ కె బాజీవలి, యూనియన్ జిల్లా కోశాధికారి దారివేముల బాబీ, యూనియన్ జిల్లా కమిటీ సభ్యులు ఎస్ కె అన్ను, జి.రమేష్, జర్నలిస్టు లు డి. జగన్ మోహన్ రెడ్డి,బి. మల్లికార్జున రావు, జి. మల్లికార్జున రెడ్డి, ఎస్ కె బషీర్,వేసపోగు రాజు, పల్లా ఓభయ్య,కొప్పరపు శ్రీనివాస రావు,ఎస్ కె శౌకత్, ఎస్ కె.కరీం, ఏ. కృష్ణయ్య గౌడ్, ఏ . వెంకట్,కె.వెంకటేశ్వర్లు, దుర్గారావు, వై.సుబ్బారావు, యాడ్ ఇంచార్జి మేడవరం మల్లికార్జున శర్మ, హనుమారెడ్డి, బుదాల థామస్ తదితరులు పాల్గొన్నారు.

# పొదిలి మునిసిపల్ కమిషనర్ ను కలసిన మధుసూదన్



**పొదిలి, పెన్ పవర్, ఆగస్టు 17,**

పొదిలి మునిసిపల్ కమిషనర్ రామ్మోహనరావు ను ఆర్యవైశ్య సంఘ నాయకులు గునుపూడి మధుసూదన్ రావు కలిశారు. మునిసిపల్ కమిషనర్ గా రామ్మోహనరావు ఇటీవలే బదిలీపై వచ్చారు. ఈ సందర్భాన్ని పునస్కరించుకొని సోమవారం నాడు మధుసూదన రావు ఆయనను మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ముందుగా మునిసిపల్ కమిషనర్ ను మధుసూదన్ రావు శాలువా తో సత్కరించి, స్వీట్ బాక్స్ అందజేశారు. ఈ కార్యక్రమంలో మధుసూదనరావుతోపాటు సీనియర్ జర్నలిస్ట్ వడ్డే వేణు కూడా పాల్గొన్నారు.

# మంత్రి గొట్టిపాటి ఆదేశాలతో నూతన విద్యుత్ లైన్ల పనులు

## వోల్టేజ్ తగ్గకుండా చూడడమే ప్రధాన లక్ష్యం - ఈఈ మస్తాన్ రావు



**సంతమాగులూరు, (బల్లికురవ) పెన్ పవర్, ఆగస్టు 17**

బల్లికురవ మండలం వేమవరం గ్రామంలో నూతన విద్యుత్ లైన్ ఏర్పాటు కోసం సోమవారం ఈఈ మస్తాన్ రావు ఆధ్వర్యంలో భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో ఈఈ మస్తాన్రావు మాట్లాడుతూ 50 సంవత్సరాల క్రితం ఏర్పాటు చేసిన విద్యుత్ లైన్ల కారణంగా తరచూ గ్రామస్తులు లో వోల్టేజ్ సమస్యలను ఎదుర్కొంటూ ఇబ్బంది పడుతున్నారని అన్నారు. విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఆదేశాలతో గ్రామంలో విద్యుత్ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందన్నారు. ఎస్సీ ఎస్టీ కాలనీలలో మీటర్ వినియోగంపై అవగాహన కల్పించారు. 150 కడితేనే విద్యుత్ మీటర్ అందజేస్తామని, ప్రభుత్వం కల్పిస్తున్న ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.ఎస్సీ ఎస్టీలకు ఉచిత సోలార్ కనెక్షన్లు మంజూరు చేస్తామని, గ్రామంలో 30 మంది వినియోగదారులకు ఇప్పటికే అందజేయడం జరిగిందన్నారు. మరో 50 మందికి సోలార్ కనెక్షన్లు మంజూరు చేయటానికి సిద్ధంగా ఉన్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈ శ్రీనివాస్, ఏఎంసీ వైస్ చైర్మన్ దేవినేని నరేంద్ర, గొట్టిపాటి మారుతి, తదితరులు ఉన్నారు.

# గిద్దలూరు అర్బన్ స్వర్ణ వార్డు సచివాలయ సిబ్బంది ఆత్మీయ సమావేశం

## వెల్ఫేర్ ఫండ్ ఏర్పాటుకు నిర్ణయం

**గిద్దలూరు పెన్ పవర్ ఆగస్టు 17**

గిద్దలూరు ఎన్జీవో హోం మీటింగ్ హాల్ లో సోమవారం,గిద్దలూరు అర్బన్ స్వర్ణ వార్డు సచివాలయ సిబ్బంది ఆత్మీయ ఉమ్మడి సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గిద్దలూరు అర్బన్ పరిధిలోని 10 వార్డు సచివాలయాలకు చెందిన అన్ని విభాగాల కార్యదర్శులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా సిబ్బంది మాట్లాడుతూ సచివాలయ ఉద్యోగులందరూ ఒకరికి ఒకరు సహాయం చేసుకుంటూ, ఎల్లప్పుడూ ఐకమత్యంగా ముందుకు సాగాలని నిర్ణయించుకున్నారు. ఇందులో భాగంగానే అర్బన్ సచివాలయ సిబ్బంది కోసం ఒక ప్రత్యేక 'వెల్ఫేర్ ఫండ్' (సంక్షేమ నిధి) ఏర్పాటు చేయాలని అందరూ కలిసికట్టుగా తీర్మానించారు. భవిష్యత్తులో సిబ్బందిలో ఎవరికి ఏ విధమైన ఆర్థిక లేదా ఇతర ఇబ్బందులు ఎదురైనా, ఈ నిధి ద్వారా తక్షణ సహాయం అందించేలా ప్రణాళికలు సిద్ధం చేశారు. రాబోయే రోజుల్లో ఉద్యోగుల సమస్యలపై అందరూ సంఘటితంగా ఉంటూ ఒకరికొకరు మద్దతుగా నిలవాలని ఈ సమావేశంలో ఏకగ్రీవంగా తీర్మానించారు. అలాగే ఈ సంక్షేమ నిధి నిర్వహణ, భవిష్యత్తు కార్యాచరణపై అనుభవజ్ఞులైన పెద్దల నుంచి సలహాలు, సూచనలు తీసుకోవాలని సిబ్బంది నిర్ణయించారు. ఈ ఆత్మీయ సమావేశం గిద్దలూరు అర్బన్ సచివాలయ సిబ్బంది మధ్య ఐక్యతను చాటిచెప్పింది.




# బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శిగా మాదినేని లక్ష్మణ్



**సి.ఎస్.పురం,పెన్ పవర్ ఆగస్టు 17**

మార్కాపురం నూతన జిల్లా బీజేపీ కమిటీలో మండలానికి చెందిన మాదినేని లక్ష్మణ్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా కీలక బాధ్యతలు అప్పగించారు. గురువారం ప్రకటించిన నూతన జిల్లా కమిటీలో ఆయనకు ఈ పదవి దక్కింది. లక్ష్మణ్ కు జిల్లా స్థాయిలో బాధ్యతలు అప్పగించడంతో స్థానిక బీజేపీ శ్రేణుల్లో హర్షం వ్యక్తం చేస్తున్నారు ఈ సందర్భంగా మాదినేని లక్ష్మణ్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో జిల్లా ప్రధాన కార్యదర్శిగా నియమించిన బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమేష్ నాయుడు జిల్లా అధ్యక్షుడు పీవీ కృష్ణారావు, మరియు బిజెపి జిల్లా ఇన్చార్జి కొక్కెర శ్రీనివాస్ యాదవ్ కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. తన నియామకానికి సహకరించిన బీజేపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు. పార్టీ తనకు అప్పగించిన బాధ్యతను అంకితభావంతో నిర్వర్తిస్తానని అన్నారు.ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశం అభివృద్ధి పథంలో వేగంగా ముందుకెళ్తుందన్నారు కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లేందుకు కృషి చేసి, గ్రామస్థాయి నుంచి పార్టీని మరింత పటిష్టం చేసేందుకు కార్యకర్తలతో సమన్వయం చేసుకుంటూ పనిచేస్తానని తెలిపారు.పార్టీ అధిష్ఠానం ఇచ్చే ప్రతి పిలుపును విజయవంతం చేయడంతో పాటు ప్రజలతో మమేకమై వారి సమస్యలను తెలుసుకుని పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానన్నారు. బిజెపి సిద్ధాంతాలు, కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి పార్టీని బలోపేతం చేయడమే తమ లక్ష్యమని అన్నారు ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటూ కార్యకర్తలతో సన్నిహితంగా ఉండే లక్ష్మణ్ కు జిల్లాస్థాయి బాధ్యతలు అప్పగించడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు నూతన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించి పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని కోరుతూ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు శుభాకాంక్షలు తెలిపారు.

# ఎస్ఐఆర్ ముసాయిదాలో లోపాలు సరిచేయాలి



**క్రైమ్ రిపోర్టర్ పెన్ పవర్, ఒంగోలు ఆగస్టు 17**

ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్-- 2026) ముసాయిదా జాబితాలో చోటుచేసుకున్న లోపాలను తక్షణమే సరిచేయాలని సిపిఎం ఒంగోలు నగర కమిటీ డిమాండ్ చేసింది. ఓటర్లను కార్యాలయాల చుట్టూ తిప్పుకోకుండా, అభ్యంతరాలను సులభతరంగా పరిష్కరించాలని కోరింది. ఈ మేరకు ఒంగోలు ఎలక్టోరల్ ఆఫీసర్, ఒంగోలు ఆర్డీఓ చంద్రశేఖర్ నాయుడుకు సిపిఎం నాయకులు మెమోరాండం అందజేశారు. ఎన్నికల సంఘం గత నెల ఒకటో తేదీన విడుదల చేసిన ముసాయిదా ప్రకారం ఒంగోలు నియోజకవర్గ పరిధిలోని కార్పొరేషన్‌లో 178 పోలింగ్ కేంద్రాల్లో 1,77,148 మంది ఓటర్లు ఉన్నారని సిపిఎం నాయకులు తెలిపారు. వీరిలో 1,59,064 మంది ఓటర్ల వివరాలు మాత్రమే డిజిటలైజ్ కాగా, 18,084 మంది ఓటర్ల వివరాల్లో సమస్యలు ఉన్నాయని పేర్కొన్నారు. వీరిలో 10,246 మంది మ్యాపింగ్ కానివారు, 3,903 మంది మృతులుగా, 3,870 మంది శాశ్వత వలసదారులుగా చూపించినట్లు తెలిపారు. డబుల్ ఎంట్రీలకు సంబంధించిన వివరాలను కూడా స్పష్టంగా వెల్లడించలేదన్నారు. ఓటర్లు తమ వివరాల సవరణ కోసం కలర్ పాస్‌పోర్టు సైజు ఫొటోలు, ఆధార్ కార్డు, సంబంధిత రెండు రకాల ఫారాల జిరాక్స్‌లు సమర్పించారని సిపిఎం నాయకులు తెలిపారు. ఒకే పోలింగ్ కేంద్రంలో ఓటర్ల పేర్లు వరుస క్రమంలో లేకపోవడం, ఒకే కుటుంబానికి చెందిన ఓట్లు వేర్వేరు పోలింగ్ కేంద్రాల్లో ఉండటం వంటి సమస్యలు ఉన్నాయని సిపిఎం తెలిపింది. కొన్ని కుటుంబాలకు సంబంధించిన ఓట్లు రెండు, మూడు పోలింగ్ కేంద్రాల్లో ఉన్న పరిస్థితి కనిపిస్తోందన్నారు. ఓటర్లకు స్పష్టమైన మార్గదర్శకాలు ఇచ్చి, సులభతరమైన విధానంలో అభ్యంతరాలను స్వీకరించి పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఎం నగర కార్యదర్శి చీకటి శ్రీనివాసరావు, నగర కార్యదర్శివర్గ సభ్యులు తంబి శ్రీనివాసులు, నగర నాయకులు సయ్యద్ హుస్సేన్, దామా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# హత్య ప్రదేశాన్ని పరిశీలించిన జిల్లా ఎస్పీ

## హత్య ఘటనపై ఆరా... కేసును త్వరితగతిన ఛేదించేందుకు అధికారులకు పలు కీలక సూచనలు



**క్రైమ్ రిపోర్టర్ పెన్ పవర్, ఒంగోలు ఆగస్టు 17**

దర్శి మండలం బొట్లపాలెం గ్రామానికి చెందిన ముత్తుకూరు శ్రీదేవి (43) అనే మహిళను మద్దిపాడు పోలీస్ స్టేషన్ పరిధిలోని వెల్లంపల్లి సమీపంలో పైపుల ఫ్యాక్టరీ ఎదురుగా సోమవారం ఉదయం గుర్తు తెలియని వ్యక్తులు హత్య చేశారు. ఈ నేపథ్యంలో హత్య జరిగిన నేరస్థలాన్ని ప్రకాశం జిల్లా ఎస్పీ వి. హర్షవర్ధన్ రాజు క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం నేరస్థలానికి చుట్టుపక్కల పరిశీలించి, హత్య జరిగిన విధానం, నేరం జరిగిన తీరు తదితర అంశాలపై అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. క్లూస్ టీం, డాగ్ స్క్వాడ్ సిబ్బంది సేకరించిన ఆధారాలను ఎస్పీ క్షుణ్ణంగా పరిశీలించారు. నేరస్థలంలో లభించిన ప్రతి ఆధారాన్ని జాగ్రత్తగా భద్రపరచాలని అధికారులను ఆదేశించారు. నేరం జరిగిన తీరును బట్టి మృతురాలి గత చరిత్ర, ఆమెకు సంబంధించిన వ్యక్తులు, అనుమానితుల వివరాలపై అన్ని కోణాల్లో పూర్తిస్థాయిలో దర్యాప్తు చేయాలని సూచించారు. కేసు దర్యాప్తులో గుర్తుంచుకోవాల్సిన ముఖ్యమైన విషయాలను అధికారులకు వివరించారు, కేసును త్వరితగతిన ఛేదించేందుకు అవసరమైన పలు కీలక సలహాలు, సూచనలు అందించారు. హత్య జరిగిన వెంటనే క్లూస్ టీం, డాగ్ స్క్వాడ్‌ను రంగంలోకి దింపామని, ప్రత్యేక దర్యాప్తు బృందాలను ఏర్పాటు చేసి అన్ని కోణాల్లో సమగ్ర దర్యాప్తు చేపడుతున్నామని జిల్లా ఎస్పీ తెలిపారు. జిల్లా ఎస్పీ వెంట ఒంగోలు డీఎస్పీ రాయపాటి. శ్రీనివాసరావు, ఎస్బి ఇన్స్పెక్టర్ శ్రీనివాసరావు, ఒంగోలు రూరల్ సీఐ శేషగిరిరావు, మద్దిపాడు ఎస్సై వెంకట సూర్య, కొత్తపట్నం ఎస్సై సుధాకర్, ఎన్‌జీ పాడు ఎస్సై మహేంద్ర ఉన్నారు.



# విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో పాల్గొన్న దద్దాల



**పీసీపల్లి, పెన్ పవర్ ఆగస్టు 17**

మండలంలోని గొపవరపువారి పల్లి గ్రామంలో శ్రీ శ్రీ శ్రీ సీతారామ స్వామి నూతన ధ్వజ స్థంభ ప్రతిష్ట, శ్రీ పంచముఖ ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ట, శ్రీ గ్రామదేవత పోలేరమ్మ తల్లి శిఖర యంత్ర కలశ మహోత్సవం సోమవారం ఘనంగా జరిగింది. ఈ మహోత్సవానికి ముఖ్య అతిథిగా కనిగిరి వైఎస్ఆర్ సీపీ ఇంచార్జ్ డాక్టర్ దద్దాల నారాయణ యాదవ్ విచ్చేశారు. గ్రామానికి చేరుకున్న ఆయనకు పీసీపల్లి మండల వైఎస్ఆర్ సీపీ నాయకులు ఘనంగా స్వాగతం పలికి దుశ్శాలువాతో సన్మానించారు. అనంతరం డాక్టర్ దద్దాల నారాయణ యాదవ్ గ్రామదేవత శ్రీ పోలేరమ్మ తల్లి, శ్రీ సీతారామస్వామి, శ్రీ పంచముఖ ఆంజనేయ స్వామి వార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వామివార్ల చల్లని దీవెనలతో, ఆశీస్సులతో మంచిగా వర్షాలు పడి రైతులు మరియు ప్రజలు సుభిక్షంగా జీవించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వైకాపా పార్టీ నాయకులు, గ్రామ పెద్దలు పెద్ద సంఖ్యలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

# త్రిపురాంతకేశ్వర స్వామివారి దేవస్థానంలో ప్రత్యేక పూజలో పాల్గొన్న ముత్తుముల క్రిష్ణ కిశోర్



**గిద్దలూరు పెన్ పవర్ ఆగస్టు 17**

త్రిపురాంతకంలో కొలువైన శ్రీ త్రిపురాంతకేశ్వర స్వామివారి దేవస్థానాన్ని తెలుగుదేశం పార్టీ నాయకుల ముత్తుముల క్రిష్ణ కిశోర్ రెడ్డి సందర్శించారు శ్రీ త్రిపురాంతకేశ్వర స్వామివారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి, స్వామివారి ఆశీస్సులు పొందారు. నియోజకవర్గం ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని, గిద్దలూరు నియోజకవర్గం అభివృద్ధి మరింత వేగంగా కొనసాగాలని స్వామివారిని ప్రార్థించామని కృష్ణ కిషోర్ తెలిపారు.

# నాగ పంచమి సందర్భంగా సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు

**సంతమాగులూరు, (బల్లికురవ) పేన్ పవర్, ఆగస్టు 17**

బల్లికురవ మండలం నక్క బొక్కలవాడు శివారులోని ఈర్ల గంగమ్మ దేవస్థానంలో నాగ పంచమి సందర్భంగా వేడుకలు సోమవారం సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రసిద్ధ పుణ్యక్షేత్రం బ్రహ్మగుండం సుబ్రహ్మణ్యేశ్వర స్వామి సన్నిధిలో నాగులకు భక్తులు పాలు పోసి, వడపప్పు నైవేద్యం సమర్పించారు. ఈ సందర్భంగా నాగమయ్య పుట్టకు పసుపు, కుంకుమ, గాజులు, ఆవు పాలు, నైవేద్యంగా సమర్పించారు. నాగపంచమి రోజున నిర్వహించే పూజలతో కాలసర్ప దోషం తొలగిపోతుంది అనే విశ్వాసం భక్తులలో ఉండటంతో మహిళలు అధిక సంఖ్యలో పూజ కార్యక్రమాలలో పాల్గొన్నారు.



# నేటివ్ అరకు కాఫీ షాప్ ప్రారంభించిన ఎమ్మెల్యే దామచర్ల

## - ముఖ్య అతిథిగా పాల్గొన్న సినీ డైరెక్టర్ మలినేని గోపీచంద్

## - మహిళలు వ్యాపారవేత్తలుగా ఎదిగేందుకు తోడ్పాటును అందిస్తాం - డి ఆర్ డి ఎ పి డి నారాయణ

**స్టాఫ్ రిపోర్టర్ పెన్ పవర్, ఒంగోలు ఆగస్టు 17**

ఒంగోలు ఉత్తర బైపాస్ వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన నేటివ్ అరకు కాఫీ షాప్ ను ఒంగోలు శాసనసభ్యులు దామచర్ల జనార్ధన్ రావు ప్రారంభించారు. సోమవారం జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రముఖ సినీ దర్శకుడు మలినేని గోపీచంద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా దర్శకులు మలినేని గోపీచంద్ మాట్లాడుతూ తన సోదర సమానుడైన బొద్దులూరి అనుదీప్ నేటివ్ అరకు కాఫీ షాప్ ప్రారంభించడం ఎంతో సంతోషాన్నిస్తుందని, కష్టపడే తత్వం ఉన్న అనుదీప్ వ్యాపార రంగంలో ఉన్నత స్థానంలో ఉండాలని ఆకాంక్షిస్తున్నట్లు తెలిపారు. డిఆర్డిఏ వెలుగు ప్రాజెక్టు డైరెక్టర్ నారాయణ మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రతి ఇంటిలో ఒక వ్యాపారవేత్త ను చేయాలనే ఉద్దేశంలో భాగంగా డిఆర్డిఏ వెలుగు ఆధ్వర్యంలో మహిళ గ్రూప్ సభ్యుల ద్వారా నేటివ్ అరకు కాఫీకి ప్రాధాన్యతనిస్తూ నగర పరిధిలోని విష్ణుప్రియ ఫంక్షన్ హాల్ ఎదురు నేటివ్ అరకు కాఫీ షాప్ ను ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. మార్కాపురంలో జరిగిన అంతర్జాతీయ మహిళా దినోత్సవం



సందర్భంగా మహిళలను అన్ని రంగాల్లో ముందు ఉండాలనే ఉద్దేశంతో.. వారిని ఆర్థికంగా వ్యాపారవేత్తలను చేయాలని లక్ష్యంతో డిఆర్డిఏ ద్వారా ఐదు లక్షల 90 వేల రూపాయలు అందించి స్వయం సభ్యుల ద్వారా అరకు కాఫీ సెంటర్ ని ఏర్పాటు చేయటం జరిగిందని అన్నారు. అందులో 35% సబ్సిడీ రుణం అందిస్తామని అన్నారు.




మహిళలకు ప్రోత్సాహంలో భాగంగా జిల్లాలో ఎక్కడైనా పరిశ్రమలు ఏర్పాటు చేసుకుంటే వారికి ఆర్థిక సహకారాన్ని డిఆర్డిఏ ద్వారా డ్వాక్రా గ్రూప్ సభ్యులకు అందిస్తామని చెప్పారు. ఈ అవకాశాలను ఉపయోగించుకొని మహిళలు ఆర్థిక వేత్తలుగా ఎదగాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రంధాలయ సంస్థ చైర్మన్ ముప్పవరపు సుచిత్ర, కమ్మ సేవా సంఘం అధ్యక్షులు మండవ మురళీకృష్ణ, ఇతర ప్రముఖులు పాల్గొన్నారు.

## నిరుపేద విద్యార్థిని కుటుంబానికి సేవా సదన్ చేయూత



**సి ఎస్ పురం, పెన్ పవర్ ఆగస్టు 17**

గురవాజీ పేట గ్రామంలో నివాసం ఉంటున్న తూమాటి అంకమ్మ కు సేవాసదన్ వైద్య ఖర్చులు నిమిత్తం 5 వేల రూపాయలు సేవాసదన్ అధ్యక్షులు నాగిశెట్టి మాల్యాద్రి చేతుల మీదుగా సాయం అందజేశారు అంకమ్మకు కొద్ది రోజుల క్రితం ఇంటి దగ్గర పనులు చేస్తూ ఉండగా కాలు జారి పడడంతో కాలు విరిగి మూడు చోట్ల శస్త్ర చికిత్స చేయడం జరిగింది. ఆమెకు 4 నెలల పాటు విశ్రాంతి తీసుకోవాలని వైద్యులు చెప్పారు. భర్త గుడ్డివాడు , ఆమె ఇతర పనులకు పోలేక వైద్య ఖర్చులు కూడా భరించలేక పోతుందని గురవాజీ పేట హైస్కూల్ లో 8 వ తరగతి చదువుతున్న అంకమ్మ మనవరాలు తూమాటి చైత్ర అదే పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయులుగా పనిచేస్తున్న కట్టా యేసునాథం కు తెలియజేయడంతో ఆయన సేవా సదన్ రాష్ట్ర అధ్యక్షులు నాగిశెట్టి మాల్యాద్రి కి విషయం తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన సానుకూలంగా స్పందించి అంకమ్మ ఇంటికి చేరుకుని రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు కట్టా యేసునాథం గారితో కలిసి సేవా సదన్ సభ్యుల అందరి సాయంతో సేకరించిన 5 వేల రూపాయలు ఆమెకు సాయం చేశారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతినెలా సేవా కార్యక్రమాలకు సహకరిస్తున్న క్రియాశీలక సభ్యులకు ధన్యవాదాలు తెలిపారు.

## ఈర్ల గంగమ్మ గుడిలో భీష్మాచార్యుని విగ్రహ ప్రతిష్ట



**సంతమాగులూరు, (బల్లికురవ) పెన్ పవర్, ఆగస్టు 17**

బల్లికురవ మండలంలోని భక్తుల పాలిట కొంగుబంగారమై బాసిల్లుతున్న ఈర్ల గంగమ్మ ఆలయ ప్రాంగణంలో భీష్మాచార్యుని విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమం సోమవారం ఘనంగా నిర్వహించారు. ప్రతిష్టాచార్యులు వేల్పుల గోవర్ధన్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం కొనసాగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంతన మహారాజు, గంగాదేవిల కుమారుడైన దేవ వ్రతుడు భీష్ముడిగా మారాడు అన్నారు. తండ్రికి ఇచ్చిన మాట కోసం ఆ జన్మ బ్రహ్మచారిగా ఉంటానని భీషణ ప్రతిజ్ఞ చేసిన కారణంగా భీష్ముని నామధేయం ఆయనకు సమకూరిందన్నారు. అంతేకాకుండా తాను కోరుకున్నప్పుడే మరణించే విధంగా వరం పొందిన మహనీయుడు భేష్మాచార్యులు అని కొనియాడారు. ఈ సందర్భంగా అన్న సంతర్పణ కొనసాగింది.

## వెలిగొండ పునరావాస గ్రామాలపై కలెక్టర్ సమీక్ష

**తరలింపు, పరిహారం పంపిణీపై అధికారులతో ప్రత్యేక సమావేశం**

**మార్కాపురం పెన్ పవర్ ఆగస్టు 17**

వెలిగొండ ప్రాజెక్టు పునరావాస గ్రామాల ప్రజల తరలింపు, పరిహారం పంపిణీ పరిస్థితి, ఇతర అంశాలపై జిల్లా స్థాయి అధికారులతో సోమవారం మార్కాపురం కలెక్టరేట్ లో ప్రత్యేక సమావేశం జరిగింది. ఈ సమావేశానికి జిల్లా కలెక్టర్ ఎం.విజయ సునీత అధ్యక్షత వహించారు. ప్రాజెక్టు పరిధిలోని గ్రామాల్లో ఇప్పటివరకు జరిగిన పునరావాస పనులు, పరిహారం చెల్లింపులు, తరలింపు ప్రక్రియపై అధికారుల నుండి వివరాలు అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు, మార్కాపురం ఆర్డిఓ వెంకట శివరామి రెడ్డి, కనిగిరి ఆర్డిఓ అజయ్ కుమార్, ఇతర సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.పునరావాస గ్రామాల ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా తక్షణమే పరిహారం పంపిణీ పూర్తి చేయాలని, తరలింపు ప్రక్రియను వేగవంతం చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.




## అనన్య నృత్యానికి జిల్లా కలెక్టర్ రాజాబాబు అభినందనలు - ఆశీస్సులు అందించిన అధికారులు





**కల్చరల్ రిపోర్టర్, పెన్ పవర్ ఒంగోలు ఆగస్టు 17**

80 వ గణతంత్ర వేడుకల్లో భాగంగా జిల్లా కలెక్టర్ నివాసంలో జరిగిన ఎట్ హోమ్ కార్యక్రమంలో భాగంగా ఒంగోలు స్థానిక వీఐపీ రోడ్ లో నివాసం ఉంటున్న విశ్రాంత తహశీల్దార్ కె.ఎల్. నరసింహారావు కుమారుడు శ్రీకాంత్ కుమార్తె కొచ్చర్ల అనన్య చతుర్విక నృత్య ప్రదర్శనతో అందరినీ ఆకట్టుకుంది. ఈ చిన్నారి నృత్య ప్రదర్శన చూసిన జిల్లా కలెక్టర్ రాజా బాబ అనన్యకు ప్రత్యేకంగా ప్రశంశించి అభినందనలు తెలియజేశారు. అనన్య చతుర్వికను నృత్య ప్రదర్శన తిలకించిన పలువురు అధికారులు అభినందనలు తెలిపి ఆశీస్సులు అందజేశారు.

## పంట పొలాల మధ్య వినాయక విగ్రహం

### -గ్రామస్తుల చొరవతో ఆలయ నిర్మాణం..

### -ఘనంగా విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం

**సంతమాగులూరు, పెన్ పవర్, ఆగస్టు 17**

సంతమాగులూరు మండలం ఏల్చూరు గ్రామ పంట పొలాల మధ్య వినాయకుడు కొలువుదీరాడు. గ్రామానికి ఉత్తరాన పంట పొలాల మధ్య గ్రామస్తుల సంపూర్ణ సహకారంతో అత్యంత శోభాయమానంగా నిర్మించిన శ్రీ విఘ్నేశ్వరస్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవం సోమవారం భక్తిశ్రద్ధలతో వైభవంగా జరిగింది. ముందుగా నిర్ణయించిన శుభ ముహూర్తం ప్రకారం ఉదయం 11 గంటల 45 నిమిషాలకు గ్రామ వేద పండితులు వినుకొండ శరత్చంద్ర ఆధ్వర్యంలో సాంప్రదాయ పూజా కార్యక్రమాలు, వేద మంత్రోచ్ఛారణల మధ్య విగ్రహ ప్రతిష్ఠ నిర్వహించారు.

**ఆరుగురి కమిటీ ఆధ్వర్యంలో నిధుల సమీకరణ**

ఆలయ నిర్మాణం కోసం బూసి పుల్లారెడ్డి, విప్పల నర్సిరెడ్డి, దుంప శివారెడ్డి, వెన్నపూస శివారెడ్డి, ఆవుల కొండారెడ్డి, గుండు సాయికుమార్ రెడ్డి కమిటీగా ఏర్పడి గ్రామస్తుల నుంచి విరాళాలు, నిధులు సమీకరించారు. గ్రామస్తులు కూడా సంపూర్ణ ఆర్థిక సహకారం అందించడంతో ఆలయ నిర్మాణ పనులు శరవేగంగా పూర్తయ్యాయి.పంట పొలాల మధ్య విఘ్నేశ్వరుని ఆలయం నిర్మించి ప్రతిష్ఠించడం పట్ల రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. వ్యవసాయ పనుల కోసం పొలాలకు వెళ్లే సమయంలో స్వామివారిని దర్శించుకునే అవకాశం కలగడం తమకు ఎంతో ఆనందంగా ఉందని రైతులు పేర్కొన్నారు. పంటలు సమృద్ధిగా పండాలని, గ్రామంలో సుఖసంతోషాలు వెల్లివిరియాలని స్వామివారిని ప్రార్థించారు.

**వైభవంగా అన్నసంతర్పణ**

విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాన్ని పురస్కరించుకుని ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భారీ అన్నసంతర్పణ నిర్వహించారు. గ్రామస్తులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని అన్నప్రసాదాన్ని స్వీకరించారు.గ్రామస్తుల ఐక్యత, కమిటీ సభ్యుల



సమన్వయం, భక్తుల సహకారంతో నిర్మితమైన విఘ్నేశ్వరుని ఆలయం ఏల్చూరు గ్రామ ఆధ్యాత్మిక చరిత్రలో ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకుంది. పంట పొలాల మధ్య కొలువుదీరిన విఘ్నేశ్వరుడు రైతులకు, గ్రామ ప్రజలకు భక్తి విశ్వాసాలకు ప్రతీకగా నిలుస్తాడని పలువురు పేర్కొన్నారు.

## తిరుమలనాథ స్వామి ఆలయంలో ఘనంగా నాగుల పంచమి





**సి.ఎస్.పురం, పెన్ పవర్ ఆగస్టు17**

మండలంలోని తిరుమలకొండపై వెలసిన పవిత్ర పుణ్యక్షేత్రమైన శ్రీ తిరుమలనాథ స్వామి దేవస్థానంలో సోమవారం నాగుల పంచమి వేడుకలను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. దేవస్థాన కమిటీ చైర్మన్, ప్రముఖ పారిశ్రామికవేత్త తులాబందుల చలమయ్య నాయుడు, గ్రామస్తుల సహాయ సహకారాలతో స్వామి సేవకుడు పత్తి రామమూర్తి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు.ఈ సందర్భంగా తిరుమలనాథ స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి అభిషేకం, అర్చనలు తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం భక్తులు పుట్ట వద్దకు వెళ్లి నాగదేవతకు పూజలు చేసి పాలు సమర్పించారు. స్వామివారిని దర్శించుకునేందుకు పరిసర ప్రాంతాల నుంచి భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి నైవేద్యాలు సమర్పించారు.అనంతరం స్వామి సేవకుడు పత్తి రామమూర్తి భక్తులకు స్వామివారి తీర్థప్రసాదాలు, ప్రసాదాలను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా పత్తి రామమూర్తి మాట్లాడుతూ శ్రావణమాసంలో నిర్వహించే పర్వదినాల్లో నాగుల పంచమికి విశిష్టమైన ప్రాధాన్యత ఉందన్నారు నాగుల పంచమి రోజున నాగదేవతలను భక్తిశ్రద్ధలతో ఆరాధించడం సంప్రదాయంగా వస్తుందన్నారు నాగదేవతలను పూజించి అభిషేకాలు నిర్వహించి పుణ్యఫలం లభిస్తుందన్నారు ప్రతి ఒక్కరూ భక్తిశ్రద్ధలతో ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో పాల్గొని దైవానుగ్రహం పొందాలని ఆకాంక్షించారు ఈ కార్యక్రమాలలో బిజెపి నాయకులు పెద్దిరెడ్డి రమణారెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

## ఘనంగా ఏపీయూడబ్ల్యూజే ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

### - అనాథ పిల్లలు అన్నదానం

**కల్చరల్ రిపోర్టర్, పెన్ పవర్ ఒంగోలు ఆగస్టు 17**

ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ (ఏపీయూడబ్ల్యూజే) 70వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు జిల్లా వ్యాప్తంగా ఘనంగా జరిగాయి. జిల్లా కేంద్రమైన ఒంగోలులో సోమవారం స్థానిక మునిసిపల్ కార్యాలయం వద్ద ఏపీయూడబ్ల్యూజే జెండాను ఆవిష్కరించి అనంతరం ఒంగోలులోని కర్నూల్ రోడ్ లో ఉన్న అనాథ పిల్లల ఆశ్రమంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర కార్యదర్శి అలుగుల సురేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి దాసరి కనకయ్య, జిల్లా నాయకులు విజయ్, ఇఫ్తేకర్ బాషా, కోటిరెడ్డి, మాల్యాద్రి, సర్వేశ్వరరావు ప్రతాప్, సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.



# పోలీసుల వాహన ప్రమాదంపై పుకార్లు తగవు

## వాస్తవాలు గ్రహించాలని జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు సూచన.

## విధి నిర్వహణలో జరిగిన ఘటనపై రాజకీయాలు సరికాదు.






**అద్దంకి, ఆర్.సి(పెన్ పవర్) ఆగస్టు 17:**

పోలీసుల వాహనం ప్రమాదానికి గురైన ఘటనపై కొందరు కావాలనే అసత్యపు పుకార్లు సృష్టిస్తున్నారని, ప్రజలు వాస్తవాలు తెలుసుకోవాలని జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు సూచించారు. సోమవారం సాయంత్రం అద్దంకి పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన ప్రత్యేక విలేకరుల సమావేశంలో ఆయన ఈ ఘటనపై పూర్తి స్పష్టతనిచ్చారు. పోలీసుల విధి నిర్వహణపై జరుగుతున్న దుష్ప్రచారాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు.

**విధి నిర్వహణలో జరిగిన ఘటనపై విష ప్రచారమా?**

విధి నిర్వహణలో భాగంగా అనుమానితులను వెంబడిస్తున్న క్రమంలో పోలీసుల కారు ప్రమాదవశాత్తు ఓ ఆటోను ఢీకొట్టింది. అయితే, ఈ ఘటనను ఆసరాగా చేసుకుని వైసీపీ నేతలు పోలీసుల కర్తవ్య దీక్షపై విష ప్రచారం చేయడం విడ్డూరంగా ఉందని టీడీపీ నాయకులు మండిపడుతున్నారు. గురజాల, పిడుగురాళ్ల పోలీసు సిబ్బంది బల్లికురవ రావడం జీర్ణించుకోలేక, స్వాధీనం చేసుకున్న గంజాయిపై రాద్ధాంతం చేస్తున్నారని ధ్వజమెత్తారు. తమ సొంత ఉనికిని కాపాడుకునేందుకే వైసీపీ నేతలు ఇలాంటి చౌకబారు ఆరోపణలకు దిగుతున్నారని విమర్శించారు.

**బాధితులకు అండగా పోలీసులు..**

ప్రమాదం జరిగిన వెంటనే ఎస్సైలు పారిపోయారని, మద్యం మత్తులో సిగరెట్లు తాగుతూ క్షతగాత్రులను పట్టించుకోలేదని వైసీపీ నేతలు ఆరోపించడాన్ని టీడీపీ వర్గాలు తీవ్రంగా ఆక్షేపించాయి. ప్రమాదం జరిగిన వెంటనే 108 వాహనానికి సమాచారం ఇచ్చింది పోలీసులేనని స్పష్టం చేశారు. సోమవారం ఒంగోలు వైద్యశాలలో చికిత్స పొందుతున్న బాధితులను పోలీసులు స్వయంగా వెళ్లి పరామర్శించిన వాస్తవాన్ని విస్మరించి చిల్లర రాజకీయాలు చేస్తున్నారని దుయ్యబట్టారు. స్వపక్షంలో ఉన్న వర్గపోరును కప్పిపుచ్చుకునేందుకే అధికారులపై బురదజల్లుతూ ప్రభుత్వంపై విషం చిమ్ముతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

**రికవరీల్లో ముందున్నా.. అనవసర రాద్ధాంతం..**

సంతమాగులూరు పోలీసుల పరిధిలో గతంలో ఎన్నడూ లేని విధంగా అత్యధిక కేసులను ఛేదించి రికవరీల్లో అధికారులు ముందున్నారు. ఆనవాయితీ ప్రకారం అమ్మవారికి మొక్కుబడులు తీర్చుకోవడాన్ని కూడా నేరంగా చిత్రీకరిస్తూ కొందరు మాట్లాడటం శోచనీయమని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. అధికారులను తమ రాజకీయ స్వార్థం కోసం వాడుకునే ప్రయత్నాలను ప్రజలు గమనిస్తున్నారని, జిల్లా ఎస్పీ ఇచ్చిన స్పష్టతతో ఈ అసత్య పుకార్లకు తెరపడిందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

## బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డాక్టర్ ఎన్. సేతు, వై.ప్రశాంత్‌లను సన్మానించిన విశ్వహిందూ పరిషత్



**మదనపల్లి, పెన్ పవర్ ఆగస్టు 17**

ఆంధ్రప్రదేశ్ భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా నియమితులైన డాక్టర్ ఎన్. సేతు , ఎల్లంపల్లి ప్రశాంత్ లను విశ్వహిందూ పరిషత్, మదనపల్లి జిల్లా కార్యవర్గం తరపున హృదయపూర్వక అభినందనలు తెలియజేసి నూతనంగా రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా బాధ్యతలు స్వీకరించిన వారిని ప్రత్యేకంగా విశ్వహిందూ పరిషత్ మదనపల్లి జిల్లా నాయకులు ఘనంగా సన్మానించారు. విద్యా రంగంతో పాటు సామాజిక సేవా రంగంలో కూడా తనదైన సేవలను అందిస్తున్న డాక్టర్ ఎన్. సేతు కు ఈ నియామకం మరింత బాధ్యతను, ప్రజాసేవకు మరిన్ని అవకాశాలను కల్పిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అలాగే పార్టీ బలోపేతం, ప్రజా సమస్యల పరిష్కారం, సమాజ అభ్యున్నతి కోసం కృషి చేయాలని,ఎల్లంపల్లి ప్రశాంత్ కూడా మరింత అంకితభావంతో కృషి చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ మదనపల్లి జిల్లా అధ్యక్షులు గట్టి రామ్మోహన్, ఉపాధ్యక్షులు లిశ్రీనివాసులు, జిల్లా కార్యదర్శి సోంపల్లి సురేష్ బాబు, సహ కార్యదర్శులు వెంకటరమణ రెడ్డి, నాగప్రసాద్ నాయుడు,లి కోశాధ్యక్షులు సుధాకర్, రెడ్డెయ్య, సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఏల్చూరు చర్చిలో ఘనంగా విలియం కేరి జయంతి వేడుకలు



**సంతమాగులూరు, పెన్ పవర్ ఆగస్టు 17**

సంతమాగులూరు మండలం ఏల్చూరు గ్రామంలోని తెలుగు బాప్టిస్ట్ చర్చిలో ఆధునిక క్రైస్తవ మిషనరీ పితామహుడు విలియం కేరి 265వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చర్చి పాస్టర్ ఏసుదాసు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక ప్రార్థన కూడికకు గ్రామం మరియు పరిసర ప్రాంతాల నుంచి క్రైస్తవ సోదర సోదరీమణులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఈ ప్రార్థన కూడికలో ప్రముఖ దైవజనులు రెవరెండ్ నెహెమ్యా ముఖ్య వక్తగా విచ్చేసి భక్తులకు దైవ సందేశాన్ని అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విలియం కేరి కేవలం ఆధ్యాత్మిక సేవకే పరిమితం కాకుండా, భారతదేశంలో విద్యా వ్యాప్తికి మరియు సతీసహగమనం వంటి సామాజిక దురాచారాల నిర్మూలనకు ఎనలేని కృషి చేశారని కొనియాడారు. బైబిల్ గ్రంథాన్ని అనేక భారతీయ భాషల్లోకి అనువదించి, దైవవాక్యాన్ని సామాన్యులకు సైతం అందుబాటులోకి తెచ్చిన ఆయన జీవితం నేటి తరానికి ఎంతో ఆదర్శప్రాయమని పేర్కొన్నారు. కేరి చూపిన అంకితభావం, సేవాతత్పరతను ప్రతి ఒక్కరూ తమ దైనందిన జీవితంలో అలవర్చుకోవాలని పిలుపునిచ్చారు.

# పెద్ద గోగులపల్లి సమీపంలో చిరుత కలకలం

## చిరుత కోసం అటవీశాఖ అధికారులు గాలింపు





**సి ఎస్ పురం, పెన్ పవర్ ఆగస్టు 17**

మండలంలోని పెద్దగోగులపల్లి గ్రామ సమీపంలో సోమవారం తెల్లవారుజామున చిరుతపులి సంచరించినట్లు సమాచారం రావడంతో గ్రామస్తులు, వాహనదారులు భయాందోళనకు గురయ్యారు. పందులను తరుముకుంటూ వచ్చిన ఓ చిరుత గ్రామానికి సమీపంలోని రహదారిపైకి రావడాన్ని అటుగా వెళ్తున్న కొందరు వాహనదారులు గమనించినట్లు తెలిపారు. దీంతో వారు భయంతో అక్కడి నుంచి వెళ్లిపోయి విషయాన్ని గ్రామస్తులకు తెలియజేశారు. చిరుత సంచారం విషయాన్ని గ్రామస్తులు వెంటనే అటవీశాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. సమాచారం అందుకున్న ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ ఆరిఫ్ ఖాన్ తన సిబ్బందితో కలిసి చిరుత సంచరించినట్లు చెబుతున్న ప్రాంతానికి చేరుకుని పరిశీలించారు. పరిసర ప్రాంతాల్లో విస్తృతంగా గాలింపు చేపట్టారు. ఈ సందర్భంగా ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ ఆరిఫ్ ఖాన్ మాట్లాడుతూ చిరుత సంచరించినట్లు చెబుతున్న ప్రాంతాన్ని క్షుణ్ణంగా పరిశీలించినప్పటికీ అక్కడ చిరుత పాదముద్రలు గానీ, ఇతర ఆనవాళ్లు గానీ కనిపించలేదని తెలిపారు. అనంతరం గ్రామస్తులను విచారించగా రోడ్డుపై చిరుత పులి నడిచి వెళ్లడం వల్ల అడుగులు కనిపించలేదని గ్రామస్తులు తెలిపారు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అయితే చిరుత సంచారం విషయమై ఎవరూ భయాందోళనలకు గురికావాల్సిన అవసరం లేదని ఆరిఫ్ ఖాన్ సూచించారు. గ్రామ పరిసరాల్లో అవమానస్పదంగా చిరుత కనిపించిన పాదముద్రలు లేదా ఇతర జాడలు గుర్తించిన వెంటనే సమాచారం అందించాలని సూచించారు ఆయన వెంట డిప్యూటీ రేంజర్ రెడ్యా నాయక్, ఎఫ్ బి ఓ నరసింహ తదితరులున్నారు.

## కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

### కలెక్టర్ కార్యాలయం ఎదుట బీఎంఎస్ ధర్నా




**నాగర్ కర్నూల్, పెన్ పవర్ ఆగస్టు 17**

కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని, యాజమాన్యాల వేధింపులు, అక్రమ తొలగింపుల నుంచి కార్మికులకు రక్షణ కల్పించాలని బీఎంఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు రమేష్ గౌడ్ డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయం ఎదుట బీఎంఎస్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించి అధికారికి వివిధ డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా రమేష్ గౌడ్ మాట్లాడుతూ కనీస వేతన పరిమితిని 42 వేల రూపాయలకు పెంచాలని, కార్మికుల కుటుంబాలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని కోరారు. కార్మిక వ్యతిరేక నిబంధనలు తొలగించి బ్యాంకు ఉద్యోగులకు వారానికి ఐదు రోజుల పని దినాలను అమలు చేయాలని, గ్రాట్యూటీ పరిమితిని 20 లక్షల నుండి 40 లక్షలకు పెంచాలని డిమాండ్ చేశారు. భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ నిధుల నుండి కార్మికులను రక్షించాలని, రాష్ట్ర కనీస వేతనాల సలహా మండలిని ఏర్పాటు చేసి కార్మికులకు కనీస వేతన చట్టం అమలయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి రాష్ట్ర అధ్యక్షురాలు శ్రీదేవి, బీఎంఎస్ నాయకులు సుఖజీవన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి పసుపుల లక్ష్మయ్య, కోశాధికారి కుంభం ప్రకాష్, బాదం శ్రీనివాసులు, ఉద్యోగుల సంఘం నాయకులు కులకర్ణి, 108 సంఘం నాయకులు కళ్యాణ్ కార్ శ్రీను, విద్యుత్ శాఖ నాయకులు బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాలలకు అకాడమిక్ ఇన్స్ట్రక్చర్ల నోటిఫికేషన్ జారీ

### అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలి

**సి.ఎస్.పురం, పెన్ పవర్ ఆగస్టు 17**

మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో విద్యా బోధనను మరింత మెరుగుపరిచేందుకు ప్రభుత్వం 20 మంది అకాడమిక్ ఇన్స్ట్రక్చర్లను నియమించుటకు నోటిఫికేషన్ జారీ చేసినట్లు మండల విద్యాశాఖాధికారులు జె. ప్రసాదరావు1, బూదాల డేవిడ్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండల పరిధిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలకు 8 మంది, ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలకు 12 మంది అకాడమిక్ ఇన్స్ట్రక్చర్లను నియమించుటకు ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసిందని అర్హత కలిగిన అభ్యర్థులు ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనల మేరకు ఆగస్టు 20వ తేదీ లోపు మండల విద్యా వనరుల కేంద్రం నందు దరఖాస్తులు చేసుకోవాలని తెలిపారు.

## జేజే పవర్ జిమ్ విద్యార్థులు రాష్ట్రస్థాయి యోగాసన పోటీలకు ఎంపిక

### జిల్లాస్థాయిలో రోహిత్ ప్రథమం, మౌనిక ద్వితీయం

**భీమిలి, పెన్ పవర్ ఆగస్టు 17**

విశాఖ యోగ స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి యోగాసన పోటీలు ఇటీవల నిర్వహించారు. ఈ పోటీల్లో భీమిలి బ్యాంక్ కాలనీ కీతినిపేటకు చెందిన జేజే పవర్ జిమ్ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. జిల్లాస్థాయి పోటీల్లో కడమంటి రోహిత్ కుమార్ ప్రథమ స్థానం మల్లేటి మౌనిక ద్వితీయ స్థానం సాధించి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు. నేషనల్ యోగ రిఫరీ, ఫిట్నెస్ ట్రైనర్ శ్రీనివాసరావు తెలిపారు. రాష్ట్రస్థాయి యోగాసన పోటీలు ఈ నెల 29వ తేదీ నుండి 30వ తేదీ వరకు విశాఖ ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు జిమ్‌కు పేరు తీసుకువచ్చిన విద్యార్థులను స్థానికులు అభినందిస్తున్నారు.

# మా భూములను ఆన్లైన్ చేయండి కూకట్లపల్లి ఎస్టీ కాలనీ సంఘం

## మండల తాసిల్దార్ ఆఫీసు వద్ద ధర్నా చేసిన కాలనీ సంఘం వాసులు

## పేదలకు పంపిణీ చేసిన భూములను వెంటనే ఆన్లైన్ చేయాలి



**సంతమాగులూరు, (బల్లికురవ) పెన్ పవర్, ఆగస్టు 17**

బల్లికురవ మండలం కూకట్లపల్లి ఎస్టీ కాలనీ సంగం పేదలకు పంపిణీ చేసిన భూములు ఆన్లైన్ చేయాలని, అర్హులైన వారందరికీ ఇళ్ల స్థలాలు పంపిణీ చేయాలని జిల్లా రైతు సంఘం ఉపాధ్యక్షులు ఎస్కే మాబు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక తహసిల్దార్ కార్యాలయం వద్ద కెవిపిఎస్, వ్యవసాయ కార్మిక సంఘం, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పొట్లూరు రమణయ్య అధ్యక్షత వహించారు . ఈ సందర్భంగా ధర్నా ధర్నాను ఉద్దేశించి బాబు మాట్లాడుతూ స్వాతంత్రం వచ్చి 80 సంవత్సరాల అవుతున్న, దేశం అభివృద్ధి, పదంలో దూసుకెళ్తుందని చెబుతున్న, అవి కేవలం ప్రకటనలకు మాత్రమే పరిమితం అన్నారు. కూకట్లపల్లి ఎస్టీ కాలనీ సంబంధించి 1990 సంవత్సరంలో ప్రభుత్వంఇచ్చిన పట్టాలకు పాసుబుక్కులు ఇవ్వకపోవడం, ఎన్నిసార్లు మొరపెట్టుకున్న ఆన్లైన్ చేయకపోవడం ఇక్కడ అధికారులు, ప్రభుత్వం పేదల పట్ల చూపుతున్న నిర్లక్ష్యానికి నిదర్శనం అన్నారు .. వృత్తిదారుల సంఘం జిల్లా నాయకులు నాయకులు తోట తిరుపతిరావు ,సిఐటియు జిల్లా నాయకులు తంగిరాల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఎస్ టి కాలనీకి భూములు ఆన్లైన్లో తో పాటు, వీధిలైట్లు అనేక సంవత్సరాలుగా వెలగడం లేదని ,స్కూలుకు ప్రహరీ గోడలు నిర్మించాలని స్మశానానికి ప్రహరీ గోడలు నిర్మించాలని డిమాండ్ చేశారు. అనంతరం తాసిల్దార్ రవి నాయక్ వినతిపత్రం సమర్పించారు.



## జిల్లాలో 6.18 లక్షల ఓటర్లు ఎస్ఐఆర్ డ్రాఫ్ట్ జాబితా విడుదల

### – సెప్టెంబర్ 16 వరకు క్లెయిమ్స్‌కు అవకాశం

**నాగర్ కర్నూల్, పెన్ పవర్ ఆగస్టు 17**

ఎస్ఐఆర్‌లో భాగంగా నాగర్‌కర్నూల్, అచ్చంపేట, కొల్లాపూర్ నియోజకవర్గాలకు సంబంధించిన డ్రాఫ్ట్ ఓటర్ల జాబితాను అధికారులు విడుదల చేశారు. జిల్లాలోని 910 పోలింగ్ కేంద్రాలకు సంబంధించిన డ్రాఫ్ట్ జాబితా ప్రకారం మొత్తం 6,18,592 మంది ఓటర్లు ఉన్నట్లు వెల్లడైంది. వీరిలో 3,11,395 మంది పురుషులు, 3,07,182 మంది మహిళలు ఉన్నారు. అదనంగా 15 మంది ఇతర ఓటర్లు, 579 మంది సర్వీస్ ఓటర్లు ఉన్నారు. గత జాబితా నుంచి 22,669 మంది ఓటర్లు మృతి చెందినట్లు గుర్తించగా, 20,396 మంది ఓటర్లు ఇతర ప్రాంతాలకు మారినట్లు అధికారులు తెలిపారు. 18,260 మంది ఎన్యూమరేషన్ ఫారాలు సమర్పించలేదు. అర్హత ఉన్నవారి పేర్లు జాబితాలో లేనట్లయితే సెప్టెంబర్ 16లోగా క్లెయిమ్స్, అభ్యంతరాలు దాఖలు చేయాలని అధికారులు సూచించారు. ఓటర్లు తమ పేరు, చిరునామా, వయస్సు తదితర వివరాలు పరిశీలించుకోవాలని, కుటుంబంలోని అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఉందో లేదో చూసుకోవాలని కోరారు. తప్పులుంటే నిర్ణీత విధానంలో సవరణకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. అభ్యంతరాలపై నిబంధనల ప్రకారం విచారణ చేపట్టి అక్టోబర్ 19న తుది ఓటర్ల జాబితాను విడుదల చేస్తామని జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటీల్ తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటర్ల జాబితాలో ఉండేలా చర్యలు తీసుకుంటామని, ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ పారదర్శకంగా, నిష్పక్షపాతంగా ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. ప్రతి పౌరుడు ఓటర్ల జాబితాను పరిశీలించుకోవాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.



# గాలే టెస్టు: భారత బౌలర్ల ధాటికి లంక తడబాటు

**భారత్‌తో తొలి టెస్టులో కష్టాల్లో శ్రీలంక**

**మూడో రోజు ఆట ముగిసేసరికి 272/7 స్కోరు**

**కీలక ఇన్నింగ్స్ ఆడిన నిరోషన్ డిక్వెలా (80)**

**సెంచరీకి ఒక్క పరుగు దూరంలో సోనల్ దినూష (99బి)**

**భారత్‌కు ఇంకా 190 పరుగుల తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం**



**హైదరాబాద్ పెన్ పవర్:** గాలే వేదికగా భారత్‌తో జరుగుతున్న తొలి టెస్టు మ్యాచ్‌లో శ్రీలంక కష్టాల్లో పడింది. మూడో రోజు ఆట ముగిసే సమయానికి ఆతిథ్య జట్టు తన తొలి ఇన్నింగ్స్‌లో 7 వికెట్ల నష్టానికి 272 పరుగులు చేసింది. యువ బ్యాటర్ సోనల్ దినూష (99 బ్యాటింగ్) సెంచరీకి కేవలం ఒక్క పరుగు దూరంలో అజేయంగా నిలిచాడు. భారత జట్టు కంటే శ్రీలంక ఇంకా 190 పరుగులు వెనుకబడి ఉంది. భారత జట్టు తొలి ఇన్నింగ్స్ లో 116.4 ఓవర్లలో 462 పరుగులకు ఆలౌట్ అయింది. భారత తొలి ఇన్నింగ్స్ స్కోరుకు సమాధానంగా బ్యాటింగ్ ప్రారంభించిన శ్రీలంకకు ఆరంభంలోనే గట్టి ఎదురుదెబ్బ తగిలింది. మహమ్మద్ సిరాజ్ బౌలింగ్‌లో ఓపెనర్ నిషాన్ ఫెర్నాండో డకౌట్ కాగా, ఆ తర్వాత వచ్చిన బ్యాటర్లు కూడా క్రీజులో నిలదొక్కుకోలేకపోయారు. దీంతో 90 పరుగులకే 5 కీలక వికెట్లు కోల్పోయి లంక పీకల్లోతు కష్టాల్లో పడింది. ఈ క్లిష్ట పరిస్థితుల్లో వికెట్ కీపర్ నిరోషన్ డిక్వెలా (80), సోనల్ దినూష కలిసి జట్టును ఆదుకున్నారు. వీరిద్దరూ ఆరో వికెట్‌కు 146 పరుగుల విలువైన భాగస్వామ్యాన్ని నెలకొల్పి భారత బౌలర్ల సహనానికి పరీక్ష పెట్టారు. 115 బంతుల్లో 7 ఫోర్లతో 80 పరుగులు చేసిన డిక్వెలాను ప్రసిధ్ కృష్ణ ఔట్ చేసి ఈ భాగస్వామ్యానికి తెరదించాడు. అయితే,ద

మరో ఎండ్‌లో సోనల్ దినూష ఓపిగ్గా ఆడుతూ భారత బౌలర్లను సమర్థంగా ఎదుర్కొన్నాడు. మూడో రోజు ఆట ముగిసే సమయానికి 163 బంతుల్లో 4 ఫోర్లు, 2 సిక్సర్లతో 99 పరుగులతో క్రీజులో ఉన్నాడు. ప్రస్తుతం అతనితో పాటు ప్రభాత్ జయసూర్య (9బి) బ్యాటింగ్ చేస్తున్నాడు. భారత బౌలర్లలో రవీంద్ర జడేజా, మానవ్ సుతార్ చెరో రెండు వికెట్లు తీయగా, సిరాజ్, ప్రసిద్ధ్ కృష్ణ, కుల్దీప్ యాదవ్ తలా ఒక వికెట్ పడగొట్టారు. నాలుగో రోజు ఆటలో దినూష సెంచరీ పూర్తి చేసుకుని, లోయర్ ఆర్డర్‌తో కలిసి ఆధిక్యాన్ని ఎంతవరకు తగ్గిస్తాడనేది ఆసక్తికరంగా మారింది.

# హార్దిక్ ఏ జట్టులోకి వెళ్తాడో బీసీసీఐనే డిసైడ్ చేయాలా?.. ఫుల్ పవర్ ఇవ్వాలంటూ డిమాండ్!

**హైదరాబాద్ పెన్ పవర్:** ఐపీఎల్‌లో రోజు రోజుకూ ఊపందుకుంటున్న ప్లేయర్ ట్రేడింగ్ వ్యవహారాలు ఇప్పుడు తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. ముఖ్యంగా ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా ముంబై ఇండియన్స్‌ను వీడి మరో జట్టులోకి వెళ్తాడనే వార్తలు జోరుగా ప్రచారంలో ఉన్న వేళ, టీమిండియా దిగ్గజ ఆటగాడు సునీల్ గావస్కర్ బీసీసీఐ జోక్యంపై తీవ్రంగా మండిపడ్డాడు. హార్దిక్ ఏ జట్టులోకి వెళ్తున్నాడు ఎంతకు ట్రేడింగ్ జరుగుతోంది? అనే విషయాలు కేవలం రెండు ఫ్రాంచైజీలు, ఆ ప్లేయర్, బీసీసీఐకి మాత్రమే తెలియకుండా.. బోర్డే పూర్తి పవర్స్ తీసుకుని పారదర్శకమైన ఆర్థిక లావాదేవీలను పబ్లిక్ డొమైన్‌లో ఉంచాలని సన్నీ స్పష్టం చేశారు. మిడ్-డే పత్రికలోని తన తాజా కాలమ్‌లో సునీల్ గావస్కర్ ఐపీఎల్ ట్రేడింగ్ విధానంపై తీవ్ర విమర్శలు చేశారు. ట్రేడింగ్ విండో సమయంలో ఒక ఫ్రాంచైజీ నుంచి మరో ఫ్రాంచైజీకి ఆటగాళ్లు మారినప్పుడు దానికి సంబంధించిన నగదు లావాదేవీలు, డీల్ రూల్స్ రహస్యంగా ఎందుకు ఉంచుతున్నారని బీసీసీఐని ప్రశ్నించారు. ఈ డీల్ వివరాలు కేవలం బీసీసీఐ, ప్లేయర్, సంబంధిత ఫ్రాంచైజీల దగ్గర మాత్రమే ఉండటంతో మిగిలిన జట్లకు ఎలాంటి సమాచారం ఉండటం లేదని, ఇది ప్రపంచంలోనే అతి పెద్ద లీగ్ అయిన ఐపీఎల్ పారదర్శకతను దెబ్బతీస్తుందని అభిప్రాయపడ్డారు.

**ఐపీఎల్ లో పారదర్శకతే ఏకైక మార్గం:**

ఐపీఎల్‌లో ప్రతి ఫ్రాంచైజీ తమ జట్టును నిర్మించుకోవడానికి ఒక శాలరీ క్యాప్ (పరిమితి) ఉంటుంది. అయితే ట్రేడింగ్ సమయంలో బదిలీ అయ్యే కోట్ల రూపాయల వివరాలు బయటకు రాకపోవడంతో ఏ జట్టు కూడా శాలరీ క్యాప్ నిబంధనలను దాటలేదని ఇతర ఫ్రాంచైజీలు నిర్ధారించుకోలేకపోతున్నాయని సునీల్ గావస్కర్ ఆందోళన వ్యక్తం చేశారు. లీగ్‌పై అనవసర విమర్శలు రాకుండా ఉండాలంటే బీసీసీఐ నేరుగా నిబంధనలను కఠినతరం చేసి, ట్రేడింగ్ జరిగే అన్ని ఆర్థిక లావాదేవీలని బహిర్గతం చేసేలా పర్యవేక్షించాలని సూచించారు.



**కెప్టెన్సీ ఇస్తేనే ట్రేడింగ్.. హార్దిక్ కీలక షరతు:**

2024లో గుజరాత్ టైటాన్స్ నుంచి ముంబై ఇండియన్స్‌కు మారిన హార్దిక్ పాండ్యా.. అక్కడ ఆశించిన స్థాయిలో రాణించలేకపోవడం, డ్రెస్సింగ్ రూమ్ వివాదాలు, అభిమానుల వ్యతిరేకత కారణంగా ముంబైని వీడాలని భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఐపీఎల్ 2027 కంటే ముందే ముంబైని వదిలి కోల్‌కతా నైట్ రైడర్స్ , చెన్నై సూపర్ కింగ్స్ లేదా గుజరాత్ టైటాన్స్ వైపు వెళ్లేందుకు తీవ్రంగా యత్నిస్తున్నాడు పాండ్యా. ఏ జట్టులోకి వెళ్లినా తనకు కెప్టెన్సీ ఇవ్వాలనే ఏకైక షరతుతో హార్దిక్ ట్రేడింగ్ చర్చలు జరుపుతుండటం ప్రస్తుతం క్రికెట్ ప్రపంచంలో హాట్ టాపిక్ గా మారింది.

# ధోనీకి నో ఛాన్స్?: కెప్టెన్‌గా అదుర్స్, కోచ్‌గా మాత్రం వద్దు.. చెన్నై సూపర్ కింగ్స్ జ హెడ్ కోచ్‌గా అతడే బెస్ట్

**హైదరాబాద్ పెన్ పవర్:** చెన్నై సూపర్ కింగ్స్ జట్టు గత 18 సీజన్లుగా తమ హెడ్ కోచ్‌గా వ్యవహరించిన స్టీఫెన్ ఫ్లెమింగ్‌తో విడిపోయిన తర్వాత కొత్త కోచ్ వేటను వేగవంతం చేసింది. ఈ క్రమంలో ఇంగ్లాండ్ 2019 వరల్డ్ కప్ విన్నింగ్ కెప్టెన్ ఇయాన్ మోర్గాన్ సీఎస్‌కే నయా కోచ్‌గా వచ్చే అవకాశం ఉందంటూ భారత స్టార్ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ సంచలన వ్యాఖ్యలు చేశాడు. మోర్గాన్ పేరు ఫ్రాంచైజీ వర్గాల్లో బలంగా వినిపిస్తోందని, దీనిపై ప్రాథమిక చర్చలు కూడా జరుగుతున్నాయని అశ్విన్ వెల్లడించాడు.



**మోర్గాన్, మెక్‌కలమ్ వద్దే వద్దు: శ్రీకాంత్**

రవింద్రన్ అశ్విన్ ప్రతిపాదనను భారత జట్టు మాజీ ఓపెనర్ కృష్ణమాచారి శ్రీకాంత్ తీవ్రంగా ఖండించారు. తన యూట్యూబ్ ఛానెల్‌లో మాట్లాడిన ఆయన.. ఇయాన్ మోర్గాన్‌ను కానీ, బ్రెండన్ మెక్‌కలమ్‌ను కానీ సీఎస్‌కే హెడ్ కోచ్‌గా అంగీకరించేది లేదని స్పష్టం చేశారు. మోర్గాన్ ఇంగ్లాండ్‌కు మంచి కెప్టెనే కావచ్చు కానీ, ఐపీఎల్‌లో కేకేఆర్ కెప్టెన్‌గా గొప్పగా ఏమీ సాధించలేదని, అతడు కా కామెంట్రీకే పరిమితమైతే బెటర్ అని శ్రీకాంత్ ఎద్దేవా చేశారు.

**మైఖేల్ హస్సీయే పర్ఫెక్ట్ ఛాయిస్:**

బయట నుంచి ఎవరినో తీసుకురావాల్సిన అవసరం చెన్నై సూపర్ కింగ్స్ జట్టుకు లేదని, ప్రస్తుతం జట్టు బ్యాటింగ్ కోచ్‌గా ఉన్న మిస్టర్ క్రికెట్ మైఖేల్ హస్సీనే ఆటోమేటిక్‌గా హెడ్ కోచ్‌గా నియమించాలని శ్రీకాంత్ సూచించారు. హస్సీకి సీఎస్‌కే సంస్కృతిపై సంపూర్ణ అవగాహన ఉందని, జట్టును నడిపించేందుకు అతడే అత్యుత్తమ ఎంపిక అని పేర్కొన్నారు. కేకేఆర్‌ను 2021లో ఫైనల్‌కు తీసుకెళ్లిన అనుభవం మెక్‌కలమ్‌కు ఉన్నప్పటికీ, ఆయన శైలి సీఎస్‌కేకు సరిపోదని అభిప్రాయపడ్డారు.

**ముందు ఎంఎస్ ధోనీ రోల్ తేలాలి:**

కొత్త కోచ్ నియామకానికంటే ముందు చెన్నై జట్టులో ది గ్రేట్ మిస్టర్ కూల్ కెప్టెన్ మహేంద్ర సింగ్ ధోనీ భవిష్యత్తు ఏంటి అనేది తేలాలని మాజీ క్రికెటర్ శ్రీకాంత్ వ్యాఖ్యానించారు. రాబోయే రోజుల్లో ధోనీ పాత్ర ఏంటి? అతడు ఏ హోదాలో ఉంటాడు? అనే విషయంపై ముందుగా స్పష్టత రావాలని చెప్పారు. ధోనీ రోల్‌పై క్లారిటీ వచ్చిన తర్వాతే కొత్త హెడ్ కోచ్ నియామకం, జట్టు భవిష్యత్తు ప్రణాళికలు ముందుకు కొనసాగుతాయని క్రిష్ స్పష్టం చేశారు.



ప్రత్యేకమైన కట్-అవుట్ డిజైన్ దుస్తుల్లో నిధి అగర్వాల్ మెరుపులు

# పసుపు చీరలో ఏజ్‌లెస్ క్వీన్ త్రిష కృష్ణన్

దక్షిణాది సినీ పరిశ్రమలో దశాబ్దాలుగా తన ఏకఛత్రాధిపత్యాన్ని కొనసాగిస్తున్న పాపులర్ నటి త్రిష కృష్ణన్ తాజాగా సోషల్ మీడియాలో షేర్ చేసిన ఫోటోలు నెటిజన్లను ఎంతగానో ఆకట్టుకుంటున్నాయి. సంప్రదాయబద్ధమైన పసుపు రంగు చీర ధరించి దేవకన్యలా మెరిసిపోతున్న తన ఫోటోలను ఇన్‌స్టాలో పోస్ట్ చేశారు. విశేషమేమిటంటే ఆ చీర తన తల్లిదేనని తెలిపి అభిమానులను మురిపించారు. ఈ రాయల్ లుక్‌లో త్రిషను చూసిన అభిమానులు, నెటిజన్లు -ఏజ్‌లెస్ క్వీన్- అని ప్రశంసిస్తున్నారు.నాలుగు పదుల వయసుకు చేరువవుతున్నా త్రిష గ్లామర్ లో కించిత్ కూడా మార్పు రాలేదని.. రోజురోజుకూ ఆమె మరింత అందంగా తయారవుతున్నారని అభిమానులు మురిసిపోతున్నారు. నటి ఖుష్బూ సుందర్, ఐశ్వర్య కల్పాతి సహా పలువురు సినీ ప్రముఖులు త్రిష అలంకరణకు.. తన అందమైన రూపానికి ఫిదా అయిపోయి ప్రశంసలను కురిపించారు. కొందరు నెటిజన్లు త్రిష క్లాసిక్ సినిమాల్లోని డైలాగులను గుర్తుచేసుకుంటూ ఈ పోస్ట్‌ను సోషల్ మీడియాలో ట్రెండింగ్‌లోకి తెచ్చారు.మరోవైపు ఈ పోస్ట్ కింద నెటిజన్ల మధ్య తీవ్రమైన రాజకీయ, వ్యక్తిగత చర్చలు కూడా వేడెక్కిస్తున్నాయి. ముఖ్యంగా దళపతి విజయ్ సారథ్యంలోని పొలిటికల్ మీటింగ్‌లు లేదా తమిళనాడు ప్రభుత్వ సభల్లో త్రిష కనిపించడంపై రకరకాల అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. కొందరు అభిమానులు త్రిషను సరదాగా విజయ్ కి చెల్లెలు(తంగచ్చి) అంటూ పోల్చగా.. మరికొందరు మాత్రం విజయ్ రాజకీయ భవిష్యత్తును.. ఆయన భార్య సంగీతను ప్రస్తావిస్తూ త్రిష ఇటువంటి పబ్లిక్ ఈవెంట్లకు దూరంగా ఉంటేనే మంచిదని ఘాటు వ్యాఖ్యలు చేశారు. ఈ చర్చల నడుమ మరికొందరు నెటిజన్లు నటుడు శింబు (మాజీ ప్రియుడిగా ప్రచారం ఉంది) పేరును తెరపైకి తెచ్చారు. విజయ్ పొలిటికల్ ఇమేజ్‌ను ఇబ్బంది పెట్టకుండా.. ప్రస్తుతం సింగిల్‌గా ఉన్న శింబును త్రిష పెళ్లి చేసుకోవచ్చు కదా అంటూ విమర్శనాత్మకంగా.. సరదాగా సలహాలు ఇవ్వడం కనిపించింది. వీటికి తోడు గిల్లి, లియో చిత్రాల్లో వీరిద్దరి కాంబినేషన్‌ను ప్రస్తావిస్తూ వారి ఆన్-స్క్రీన్, ఆఫ్-స్క్రీన్ కెమిస్ట్రీపై నెటిజన్లు రకరకాల విశ్లేషణలు చేశారు.ఏది ఏమైనా తన అందంతో నెటిజన్లను కట్టిపడేస్తూనే... సోషల్ మీడియా వేదికగా నిరంతరం చర్చల్లో నిలవడం త్రిష ప్రత్యేకత. ఒకవైపు సౌత్ ఇండస్ట్రీలో వరుస క్రేజీ ప్రాజెక్ట్‌లతో దూసుకుపోతున్న ఈ తమిళ తంగం.. మరోవైపు సోషల్ మీడియాలో తన ప్రొఫైల్ ద్వారా కోట్లాది మంది అభిమానుల దృష్టిని ఆకర్షిస్తున్నారు. వివాదాలు, విమర్శలు ఎలా ఉన్నా త్రిష పసుపు చీర లుక్ మాత్రం ఇన్‌స్టాగ్రామ్‌లో సెన్సేషన్‌గా మారింది.



# రన్‌టైమ్: నిడివి పెరిగినా ప్రేక్షకుల ఆదరణ!



వెండితెరపై సినిమా చూసే అనుభవంలో కాలక్రమేణా అనేక మార్పులు వస్తున్నాయి. ఒకప్పుడు సినిమాలకు రెండున్నర గంటల నిడివి మాత్రమే ఐడియల్ రన్‌టైమ్‌గా ఉండేది. అంతకంటే ఎక్కువైతే ప్రేక్షకులు బోర్ ఫీలవుతారనే అపనమ్మకం ట్రేడ్ వర్గాల్లో ఉండేది. కానీ ప్రస్తుతం ఆ లెక్కలన్నీ తలకిందులవుతున్నాయి. కథలో దమ్ముంటే, భావోద్వేగాలు పండుతుంటే నిడివి ఎంత ఉన్నా? ప్రేక్షకులు ఆస్వాదిస్తారనే నిజాన్ని ఇటీవలి కాలంలోని బాక్సాఫీస్ ఫలితాలు స్పష్టం చేస్తున్నాయి.ప్రస్తుత ట్రెండ్‌ను పరిశీలిస్తే -పుష్ప 2-, -యానిమల్-, -ఆర్‌ఆర్‌ఆర్- వంటి భారీ చిత్రాలు మూడు గంటల నిడివిని దాటినా బాక్సాఫీస్ వద్ద అసాధారణ విజయాలను నమోదు చేశాయి. రీసెంట్‌గా రిలీజ్ అయిన రణ్‌వీర్ సింగ్ -ధురంధర్- చిత్రం కూడా సుదీర్ఘమైన రన్‌టైమ్‌తో థియేటర్లలోకి వచ్చి అద్భుతమైన వసూళ్లను సాధించి సరికొత్త రికార్డులను సృష్టించింది. ఈ విజయాపజయాల సరళి చూస్తే? ప్రేక్షకులకు నిడివితో పనిలేదని, బలమైన కంటెంట్ ఉంటే గంటల తరబడి థియేటర్లలో కూర్చునేందుకు సిద్ధంగా ఉన్నారని రుజువవుతోంది.ఈ కోవలోనే కన్నడ దర్శకురాలు గీతూ మోహన్‌దాస్ దర్శకత్వంలో యశ్ హీరోగా తెరకెక్కిన మోస్ట్ అవేటెడ్ మూవీ -టాక్సిక్- కూడా భారీ నిడివితో రాబోతున్నట్లు తెలుస్తోంది. ఈ చిత్రం ఏకంగా 3 గంటల 14 నిమిషాల నిడివితో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నట్లు సమాచారం. గ్యాంగ్‌స్టర్ డ్రామా నేపథ్యంలో తెరకెక్కుతున్న ఈ సినిమాకు ఇంతటి సుదీర్ఘ రన్‌టైమ్ ఉండటం ఆసక్తికరంగా మారినా? మేకర్స్ మాత్రం కంటెంట్‌పై పూర్తి విశ్వాసంతో ఉన్నారు.సినిమాలో ల్యాగ్ ఉందా లేదా అనేది నిడివిని బట్టి నిర్ణయించలేమని, కథ చెప్పే విధానం .. స్క్రీన్ ప్లే గ్రిప్పింగ్‌గా ఉంటే మూడు గంటల సమయం కూడా నిమిషాల్లో గడిచిపోతుందని ట్రేడ్ నిపుణులు విశ్లేషిస్తున్నారు. దర్శకులు తాము చెప్పాలనుకున్న భావోద్వేగాలను, పాత్రల లోతును ప్రేక్షకులకు పూర్తిగా అనుభూతి చెందించడానికి పెద్ద చిత్రాలకు అదనపు సమయం ఎంతో అవసరమవుతోంది. అందుకే కంటెంట్ డిమాండ్ చేసినప్పుడు నిడివిని తగ్గించడానికి దర్శక నిర్మాతలు వెనుకాడటం లేదు.మొత్తానికి సినిమాలో విషయం ఉంటే? రన్‌టైమ్ మ్యాటర్ కాదు అనే సరికొత్త సూత్రం ఇండియన్ సినిమా ఇండస్ట్రీలో ట్రెండ్‌గా మారింది. ప్రేక్షకులకు విజువల్ వండర్‌తో పాటు బలమైన డ్రామాను అందించగలిగితే? వారు సినిమా నిడివిని సమస్యగా చూడరని భారీ చిత్రాల విజయం నిరూపిస్తోంది. రాబోయే రోజుల్లో పెద్ద బడ్జెట్ పాన్-ఇండియా సినిమాలన్నీ ఇదే బాటలో నడిచే అవకాశం కనిపిస్తోంది.ఈ పరిణామాలు దర్శకులకు మరింత స్వేచ్ఛను ఇస్తున్నాయి. కమర్షియల్ హంగుల కోసం కథను కుదించాల్సిన అవసరం లేకుండా ఊహాశక్తికి తగినట్లుగా పూర్తి స్థాయి సినిమాను తెరకెక్కించే వెసులుబాటును ఈ ట్రెండ్ కల్పిస్తోంది. ప్రేక్షకులు కూడా ఎంటర్‌టైన్‌మెంట్ మాత్రమే కాకుండా పరిపూర్ణ సినిమా అనుభూతిని కోరుకుంటున్నారనడానికి సుదీర్ఘ చిత్రాల భారీ విజయమే తిరుగులేని నిదర్శనంగా భావిస్తున్నారు.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, ONGOLE MANDAL, prakasam district, Andhrapradesh-523001. and published at D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, ONGOLE MANDAL, prakasam district, Andhrapradesh-523001. Editor: GANTYADA APPARAO. Mobile : 9059465965, RNI : APTEL/25/A2230, editorpenpower@gmail.com